నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
మంగళవారం డిసెంబర్ 17, 2024 www.navatelangana.com

సబ్‌జైల్ సందర్శన



- సౌకర్యాలు పరిశీలించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఉప కారాగారాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టీ నాగరాణి సందర్శించారు. ఖైదీల వివరాలు సేకరించి, ఖైదీల సౌకర్యాలు, వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంట గది, వంట ఆహార సామాగ్రి తనిఖీ చేశారు. ఆమె వెంట డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాది మోహన్ రావు, సబ్ జైలు సూపరింటెండెంట్ సంజీవ రెడ్డి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ జూనియర్ అసిస్టెంట్స్ శ్రవణ్ కుమార్ సాయిప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-బాల్కొండ



అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సీజ్ చేసినట్లు బాల్కొండ ఎస్ ఐ నరేష్ సోమవారం తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం మినీ గూడ్స్ వాహనంతో బాల్కొండ గ్రామం పాత బస్ స్టాండ్ వద్ద అక్రమంగా పిడీఎస్ బియ్యాన్ని రవాణా చేస్తుండగా పోలీసులు ఆదివారం పట్టుకొని సీజ్ చేశారు. మొత్తం 62 సంచుల్లో 37.20 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వీటి విలువ సుమారు 74,400 ఉంటుందని తెలిపారు. పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేయడం, విక్రయించడం, పరిధికి మించి నిల్వ చేయడం, రవాణా చేయడం చట్ట విరుద్ధమని తెలిపారు. అబ్దుల్ ఖలీల్, అబ్దుల్ రిజ్వాన్ ఖాన్‌పై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.



కామారెడ్డి : పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్షలు

- పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్‌లు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/కామారెడ్డి

రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నిర్వహిస్తున్న గ్రూప్-2 పరీక్షలు కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ప్రశాంతంగా ముగిసినట్టు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. కాగా పలు సెంటర్‌లను సోమవారం పరిశీలించారు. సోమవారం ఉదయం సెషన్ లో జరిగిన పరీక్షకు జిల్లాలో మొత్తం 19,855 మంది అభ్యర్థులకు గాను, 8915 మంది హాజరు కాగా, 10940 మంది గైర్హాజరు అయ్యారని, అదేవిధంగా మధ్యాహ్నం మొత్తం 19,855 మంది అభ్యర్థులకు గాను, 8911 మంది హాజరు కాగా, 10944 మంది గైర్హాజరు అయ్యారని వివరించారు. ఆది,సోమ వారాలలో ఉదయం, మధ్యాహ్నం చొప్పున మొత్తం నాలుగు సెషన్లలో జరిగే గ్రూప్-2 పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, పకడ్బందీగా జరిగేలా అన్ని చర్యలు తీసుకోని పూర్తి చేశామని కలెక్టర్ వెల్లడించారు.

కామారెడ్డి : కామారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో కొనసాగుతున్న గ్రూప్ 2 పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సోమవారం తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రంలో ఏర్పాటుచేసిన మౌలిక సదుపాయాలు తాగునీరు, విద్యుత్, టాయిలెట్స్, మెడికల్ సేవలు పై చీఫ్ సూపరింటెండెంట్ ను అడిగి తెలుసుకున్నారు. సి.ఎస్. రూం లో ఏర్పాటు చేసిన సి.సి. కెమరా, కాన్ఫిడెన్షియల్ మెటీరియల్, కేంద్రంలోని గదులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.కిష్టయ్య, డిపార్టుమెంటల్ అధికారిణి రజిత, ఆర్డీఓ రంగనాథ్ రావు, తహసీల్దార్ జనార్ధన్ ఉన్నారు.

ఇచ్చిన మాట తప్పితే పోరాటాలను ఉధృతం చేస్తాం

- ఎన్నికల హామీ మేరకు మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం రూ.10 వేలు అమలు చేయండి
- పెండింగ్ బిల్లులు చెల్లించాలి
- సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల నిరసన

నవతెలంగాణ-కంఠేశ్వర్

మధ్యాహ్న భోజన కార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కనీస వేతనం రూ.10 వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. ఇచ్చిన మాట తప్పితే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 48 గంటల నిరసన దీక్షను నగరంలోని ధర్నాచౌక్‌లో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐటియు కార్యదర్శి నూర్జహాన్, అధ్యక్షులు శంకర్ గౌడ్, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చామంతి, లక్ష్మి మాట్లాడారు. 'రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికులకిచ్చే గౌరవ వేతనం, విద్యార్థులకిచ్చే మెనూ చార్జీలు పెండింగ్‌లో ఉన్నాయి. నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి ప్రభుత్వానికి ఎదురు పెట్టుబడి పెట్టి, వంట చేసి పెడుతున్నారు. దీంతో కార్మికులు అప్పులపాలౌతున్నారు. తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో చేసిన వాటికే బిల్లులు రాలేదు. పైగా రాగి జావ పోయాలి, బిల్లులు రాకపోయినా పిల్లలకు వండి పెట్టాలని ఒత్తిడి చేస్తున్నారు. బిల్లులు విడుదల చేయకుండా వండటం ఎలా ? కనుక ప్రభుత్వం జోక్యం చేసుకొని వెంటనే పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలని' డిమాండ్ చేశారు.

'పెరిగిన వేతనం కొన్ని జిల్లాల్లో కొన్ని మండలాల్లో మాత్రమే ఇచ్చారు. అది కూడా నెల నెలా సక్రమంగా ఇవ్వడం లేదు. ఒకపక్క ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పెరిగిన ధరలకనుగుణంగా పిల్లలకిచ్చే మెనూ చార్జీలు పెంచడం లేదు. కార్మికుల జీతాలు పెరగకపోగా ఉన్న జీతాలు కూడా నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయి. మెనూ చార్జీలు పెంచాలని, కార్మికుల పెండింగ్ జీతాలను వెంటనే విడుదల చేసి కార్మికుల వ్యక్తిగత ఖాతాల్లోనే వేయాలని, కోడిగుడ్డుకు అదనపు బడ్జెట్ కేటాయించాలని లేకుంటే ప్రభుత్వమే సరఫరా చేయాలి' డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజనానికి సైతం సబ్సిడీపై 500 రూపాయలకు గ్యాస్ ఇవ్వాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కార్మికులకు కనీస వేతనం రూ.పది వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నన్నే సాబ్, సుజాత సుదర్శన్ రెడ్డి, హరి శంకర్, శ్రీనివాస్, శేఖర్, శిరీష, శివకల, జయమ్మ మల్లమ్మ, సాయమ్మ తదితరులు పాల్గొన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు దీక్షకు కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ గంగాధర్, ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత తదితరులు సంఘీభావం తెలిపారు.



ధర్నా చౌక్‌లో నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు, మధ్యాహ్న భోజన కార్మికులు

సీఎం కప్పతో ముగ్గులు వేసి నిరసన

- 7వ రోజుకు సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె



ముగ్గులు వేసి మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

నవతెలంగాణ-కామారెడ్డి

సమగ్ర శిక్ష ఉద్యోగుల తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం నాటికి ఏడవ రోజుకు చేరుకుంది. సోమవారం మహిళా ఉద్యోగులు ముగ్గులు వేసి వారి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సంపత్ లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని, తమని రెగ్యులర్ చేయాలని, అప్పటివరకు వెంటనే పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలలో బోధించే ఉపాధ్యాయులే తమ సమస్యల సాధనకై రోడ్డుమీద ఎక్కి ముగ్గులు వేస్తూ మహిళల పట్ల నీ చిత్తశుద్ధిని చాటుకోవాలని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. పంజాబ్ ,హర్యానా, హిమాచల్ ప్రదేశ్,డిల్లీ ఇతర రాష్ట్రాల్లో సమగ్ర శిక్ష ఉద్యోగులను పర్మినెంట్ చేశారని, తెలంగాణ రాష్ట్రమొస్తే తమ 18 సంవత్సరాల సేవలను గుర్తించి రెగ్యులరైతామని అను కున్నామన్నారు. ఒకవేళ మీకు జీవో 16 హైకోర్టు ఇచ్చిన తీర్పు అడ్డొస్తే సెర్ప్, ఈజీఎస్ ఉద్యోగులకు వలే పే స్కేల్ అమలు చేస్తూ ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన అన్ని సౌకర్యాలను కల్పించాలని కోరారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించకుంటే విద్యార్థులతో సహా రోడ్లపై బైఠాయించి సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మధ్యాహ్న భోజన కార్మికులు మద్దతు తెలిపారు.

సైబర్ క్రైమ్ కేసుల క్లైమ్‌లు
లోక్ అదాలత్‌తో సత్వర పరిష్కారం

- 174 కేసుల్లో 71 లక్షలు బాధితులకు అందజేత
- రాష్ట్రస్థాయిలో నిజామాబాద్ జిల్లాకు 5వ స్థానం : ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ
- కామారెడ్డిలో 64 కేసుల్లో రూ.9.14 లక్షలు బాధితులకు అందజేత

నవతెలంగాణ-కంఠేశ్వర్

సైబర్ క్రైమ్ కేసులను జాతీయ లోక్ అదాలత్ ద్వారా సత్వర పరిష్కారం చేసుకోవచ్చని ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ తెలిపారు. సైబర్ క్రైమ్ కేసుల్లో బ్యాంక్‌లో హోల్డ్‌లో ఉన్న అమౌంట్‌ను బాధితులకు ఇప్పించడంలో రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా ఐదవ స్థానంలో నిలిచినట్టు తెలిపారు. శనివారం జిల్లా కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌లో సైబర్‌క్రైమ్‌లకు సంబంధించిన కేసుల పరిష్కారంపై సోమవారం ఇన్‌చార్జి సీపీ వివరాలు వెల్లడించారు.

మొత్తం 174 కేసులలో మొత్తం రూ. 71,52,505 లను బాధితులకు అందజేయడంలో చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. వివిధ బ్యాంక్‌లలో హెూల్డ్ అయి ఉన్న డబ్బులను జాతీయ లోక్ అదాలత్ ద్వారా ఫిర్యాదుదారులకు వారి డబ్బులను ఇప్పించడానికి ఉత్తర్వులను జారీ చేసినట్టు తెలిపారు. రూ.25 వేల కన్నా ఎక్కువ నష్టపోయిన 131 కేసులు, అంత కన్నా తక్కువ నష్టపోయిన వాటిల్లో 43 కేసులు పరిష్కరించినట్టు తెలిపారు. అదేవిధంగా కోర్టులో ఫైల్ చేసిన మొత్తం 174 కేసులలో రూపాయలు 71,52,505-00 అందిం చమన్నారు. బాధితుల డబ్బులను ఇప్పించడం కోసం ఎలాంటి ఆటంకాలు లేకుండా తగు చర్యలు తీసుకుని జాతీయ లోక్ అదాలత్ ద్వారా వివిధ రకాల సైబర్ నేరాలలో మోసపోయిన బాధితులకు పరిష్కరించినట్టు తెలిపారు. రాష్ట్రస్థాయిలో నిజామాబాద్ జిల్లాకు సైబర్ క్రైమ్ కేసులలో సత్వర పరిష్కారం చేయడం వలన ఐదవ స్థానం వచ్చినట్టు తెలిపారు.

సైబర్ నేరాగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని, లోన్ యాప్‌లకు దూరంగా ఉండాలని సూచిం చారు. కస్టమర్ కేర్ నెంబర్లను గుగూల్ లో అస్సలు వెతకవద్దని, ఆయా సంస్థల అధికారిక వెబ్సైట్ నుంచి మాత్రమే కస్టమర్ కేర్ నెంబర్లను పొందాలని సూచించారు. అపరిచిత నెంబర్ల నుంచి ఫేస్ బుక్, వాట్సాప్ ద్వారా వచ్చే వీడియో కాల్స్‌కు స్పందించ వద్దు అని సూచించారు. సైబర్ క్రైమ్ బారిన పడిన వారు ఈ గోల్డెన్ అవర్‌లో 1930కు త్వరితగతిన ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు.



నిజామాబాద్ కమిషనరేట్ ఇన్‌చార్జి సీపీ, కామారెడ్డి ఎస్పీ సింధుశర్మ

కామారెడ్డిలో 64 సైబర్‌క్రైమ్ కేసుల పరిష్కారం

కామారెడ్డి : లోక్ అదాలత్ ద్వారా కామారెడ్డి జిల్లాలో సైబర్ నేరస్తుల మోసలకు గురి అయిన 64 మంది బాధితులకు రూ. 9,14,599/- అందజేయాలని బ్యాంక్ అధికారులకు ఉత్తర్వులు జారీ చేసినట్టు కామారెడ్డి ఎస్పీ సింధుశర్మ తెలిపారు. 25 వేల లోపు నగదు మోసపోయిన కేసులు (32), 25 వేల పై బడిన నగదు మోసపోయిన కేసులు (32) అని తెలిపారు.

సైబర్ మోసాలలో ముఖ్యంగా క్రెడిట్డె,బిట్ కార్డ్ మోసాలు, ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టమ్ మోసాలు, ఫీడెక్స్ , బ్లూ డార్ట్, కంపెనీల వలె నకిలీ కస్టమర్ కేర్ సర్వీస్ మోసాలు, ఆదాయపు పన్ను మోసాలు, ఏటీఎం కార్డ్‌ని బ్లాక్ చేయడం, పరిమితి పెంపుదల, కేవైసీ అప్‌డేషన్, పాన్ కార్డ్ లింకేజీ, కార్డ్ రీప్లేస్‌మెంట్, రివార్డ్ పాయింట్ల పేరుతో మోసగాళ్లు అమాయక ప్రజలను మభ్యపెట్టి మోసలకు గురిచేస్తున్నట్టు తెలిపారు. ఇప్పటి వరకు సైబర్ బాధితులు పోగొట్టుకున్న 229 కేసులలోని 33,14,895 రూపాయల నగదును తిరిగి ఇప్పించినట్టు తెలిపారు.

తూకం వేసిన సోయ తిరిగి రావడం పట్ల రైతుల ఆందోళన

- న్యాయం చేయాలని ధర్నా



మద్నూర్ మార్కెట్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టిన రైతులు

నవతెలంగాణ-మద్నూర్

తేమ శాతం చూసి తూకం వేసి కొనుగోలు చేసి తరలించిన సోయా పంటను.. గోదాం అధికారులు తిరిగి పంపుతుండటం పట్ల రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని సక్రమంగా చూసి కొనుగోలు చేసిన తర్వాత మళ్లీ తిరిగి ఎందుకు పంపిస్తున్నారని, న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మార్కెట్ కమిటీ ఆవరణలో సోమవారం ఆందోళన చేపట్టారు. మద్నూర్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణంలో మద్నూర్ సింగిల్ విండో ఆధ్వర్యంలో సోయా పంట మద్దతు ధర కొనుగోలు కేంద్రం కొనసాగుతుంది. కాగా తేమశాతం చూసి తూకం వేసి బోధన్‌లోని గోదామ్‌కు తరలించిన పంటను తిరిగి ఎందుకు వెనక్కు పంపతున్నారని ప్రశ్నించారు. రైతుల ఆందోళన పట్ల సింగిల్ విండో కార్యదర్శి జే బాబురావు, మద్నూర్ తహసీల్దార్ ఎమ్‌డీ ముజీబ్ హుటా హుటిన మార్కెట్ కమిటీకి చేరుకొని రైతులతో మాట్లాడారు. వందలాది బ్యాగుల పంటను వాపస్ పంపుతున్నారని ఇలా రెండు మూడు సార్లు వాపస్ చేయడంతో తమకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు విన్నవించారు. పంట తిరిగి వెనక్కు రాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.

ఆంక్షలు లేకుండా రూ.4016 జీవనభృతి ఇవ్వాలి

- బీడీ కార్మికుల ర్యాలీ.. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-మాక్లూర్

బీడీ కార్మికులకు ఆంక్షలు లేకుండా రూ.4016 జీవనభృతి ఇవ్వాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వనమూల కృష్ణ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో బీడీ కార్మికులతో ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. అనంతరం ఉప తహసీల్దార్ పద్మలతకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వనమూల కృష్ణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 7 లక్షల మంది కార్మికులు బీడీలు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారని, గతంలో నెలకు 26 రోజుల పని దొరికేదని ఇప్పుడు నెలకు 8 నుండి 12 రోజులు పని మాత్రమే దొరుకుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం బీడీ కట్టలపై పుర్రె ఎముకలు ముద్రించిందని, జీఎస్టీ ని విపరీతంగా పెంచి బీడీ పరిశ్రమ కుదేలు అయ్యే విధంగా చేశారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే బీడీలు చేసే కార్మికులకు రూ. 4016 రూపాయల జీవనభృతిని ఇస్తామని హామీ ఇచ్చి విస్మరించిందని అన్నారు. బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న వివిధ కేటగిరీలకు చెందిన ఉద్యోగులందరికీ జీవనభృతిని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల బీడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు రాజేశ్వర్, జిల్లా నాయకులు, బీడీ కార్మికులు పాల్గొన్నారు.

రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలి

- సీఎం కప్ జిల్లా స్థాయి పోటీలను ప్రారంభించిన కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్
- క్రీడాకారులను ప్రోత్సహించేందుకే పోటీలు : తాహెర్‌బిన్ హందాన్

నవతెలంగాణ-కామారెడ్డి/నిజామాబాద్‌సిటీ

జిల్లా స్థాయిలో గెలుపొంది రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో రాణించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం స్థానిక ఇందిరా స్టేడియంలో చీఫ్ మినిస్టర్స్ కప్-2024 జిల్లా స్థాయి పోటీలను కలెక్టరు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ సీఎం కప్ సందర్భంగా జిల్లాలో గ్రామీణ, మండల స్థాయిల్లో క్రీడా పోటీలను ఇది వరకే నిర్వహించినట్టు తెలిపారు. సోమవారం నుండి ఈ నెల 21 వరకు జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. 16 ఈవెంట్స్ లో 323 క్రీడాకారులు జిల్లా స్థాయిలో పాల్గొంటున్నారని తెలిపారు. సి.ఎం. కప్ 2024 క్రీడల్లో 8000 మంది క్రీడాకారులు పాల్గొన్నారని, ఇందులో 2000 మంది క్రీడాకారులు సెలెక్ట్ అయినట్టు తెలిపారు. గెలుపు ఓటమి లు కాకుండా పాల్గొనడం అనేది ముఖ్యం అని అన్నారు. జిల్లా స్థాయి క్రీడా కారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ ను కనబరచాలనీ ఆకాంక్షించారు. జాతీయ స్థాయి క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తా మని తెలిపారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఆటలతో పాటు చదువులో రాణించాలని అన్నారు. క్రీడల పట్ల ముఖ్యమంత్రి సానుకూలం అని, క్రీడాకారులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్టు తెలిపారు.

కామారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందు ప్రియ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని 25 మండలాల్లో 8 వేల మంది క్రీడాకారులు పాల్గొన్నారని, చదువుతో పాటు సాంస్కృతిక, క్రీడల ల్లో రాణించాలని తెలిపారు. క్రీడల్లో ఆడి ఓడిన చింతించకూడదని , జిల్లా స్థాయి వరకు రావడం అభినందనీ యమన్నారు. జిల్లాకు సి.ఎం. కప్ తీసుకురావాలని కోరారు. జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి జగన్నాథన్ మాట్లాడుతూ గ్రామ, మండల స్థాయిల్లో గెలుపొందిన క్రీడాకారులు 323 మంది జిల్లా స్థాయిలో ఆడుతు న్నారని తెలిపారు. అనంతరం జిల్లా స్థాయి క్రీడలను కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. అంతకు ముందు క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రంగనాథ్ రావు, వార్డ్ కౌన్సిలర్ వనిత రాం మోహన్, జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షులు జైపాల్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్స్, పి.ఈ.టీ.లు, పలు అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడా కారులు పాల్గొన్నారు.



కామారెడ్డిలో క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న కలెక్టర్



నిజామాబాద్‌లో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న తాహెర్

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే పోటీలు : తాహెర్‌బిన్ హందాన్

నిజామాబాద్ సిటీ : జిల్లా యువజన, క్రీడల శాఖ అధ్వర్యంలో సీఎం కప్ క్రీడా పోటీలను నగరంలోని పాత కలెక్టర్ గ్రౌండ్‌లో రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా కారులను, క్రీడలను ప్రోత్సహించేందుకే పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గ్రామ పంచాయతీ స్థాయి నుంచి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 16 నుండి 21 వరకు నిజామాబాద్ జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు క్రీడాకారులు చక్కటి క్రమశిక్షణతో అనేక విజయాలు సాదించాలని కోరారు. ఈ కార్యక్రమములో జిల్లా యువజన, క్రీడల అధికారి జె.ముత్తెన్న, జిల్లా లోని పిడి లు, పిఈటీ లు పాల్గొన్నారు.

సీఎం కప్‌లో ఒలంపిక్ సంఘానికి చోటెక్కడా..?

- నుడా చైర్మన్ పేరు సైతం ప్రొటోకాల్‌లో విస్మరణ



విద్యార్థుల మార్చ్‌ఫాస్ట్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

గ్రామీణ, మండల స్థాయిలో సీఎం కప్-2024 పోటీలు పూర్తవ్వగా.. సోమవారం నుంచి జిల్లా స్థాయి పోటీలు ప్రారంభమైయ్యాయి. కలెక్టరేట్ గ్రౌండ్‌లో సోమవారం నుంచి అట్టహాసంగా ప్రారంభించారు. కానీ ఈ ఆటల పోటీలలో ఒలింపిక్ సంఘ అధ్యక్ష, కార్యదర్శులను ప్రొటో కాల్ లో మర్చిపోయారు. అంతే కాకుండా నూడా చైర్మన్ జిల్లా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కేశ వేణు పేరు ను కూడా ఇన్విటేషన్ కార్డులో మర్చిపోయారా కావాలని పెట్టా లేదా అనే చర్చలు వినిపిస్తున్నాయి.

అయితే ఒలింపిక్ సంఘ అధ్యక్ష, కార్యదర్శులను సంప్రదించగా డివైఎస్ఓ ఫోన్ చేసారని కానీ ఇన్విటేషన్‌లో పేర్లు లేకపోవడంతో తాము రాలేదని తెలిపారు. అలాగే ప్రోటోకాల్ విషయంలో కలెక్టర్‌ను కూడా సంప్రదిస్తామని జిల్లా ఒలింపిక్ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు. ఒలంపిక్ సంఘం.. క్రీడా పోటీల నిర్వహణలో ముందుంటుందని, అలాంటిది సదరు సంఘం అధ్యక్ష, కార్యదర్శుల పేర్లను విస్మరించడంపై అనేక విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అలాగే నూడా చైర్మన్‌ను కూడా పిలవకపోవడం పై కూడా విమర్శలు వినబడుతున్నాయి

ఆటలు, పాటలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయి



నవతెలంగాణ-కంఠేశ్వర్

ఆటలు, పాటల పోటీలు మనసికోల్లాసాన్ని కలిగిస్తాయని, వృద్ధాప్యంలో చురుగ్గా ఉండటానికి, ఆరోగ్యంగా ఉండటానికి ఎంతో ఉపయోగపడతాయని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ ఆధ్వర్యంలో జరిగిన ముగింపు పోటీల్లో జిల్లా అధ్యక్షులు కే రామ్మోహన్ రావు అన్నారు. రెండో రోజు రిటైర్డ్ ఉద్యోగులకు చెస్, క్యారమ్స్, యోగ, స్కిల్ గేమ్స్, రన్నింగ్, పాటల పోటీలు, ఏకపాత్రాభినయం, మహిళలకు బుక్ బ్యాలెన్స్, పాటల పోటీలు, త్రో బాల్ తదితర ఆటల పోటీల్లో విజేతలను ప్రకటించారు. క్యారమ్స్‌లో అందే సాయిలు, యోగాలో సిరప హనుమాన్లు, ప్రసాద్, హమీదుద్దీన్, శ్రీనివాస్ గౌడ్, దుర్గా ప్రసాద్ తదితరులు విజేతలుగా నిలిచారు. ఈ ఆటల పోటీలను డివిజన్ అధ్యక్షులు సిర్పా హనుమండ్లు కార్యదర్శి ప్రసాదరావు పర్యవేక్షించారు.

రామ్ మందిర్ ఉన్నత పాఠశాలకు కంప్యూటర్ వితరణ



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ కేంద్రంలోని రాంమందిర్ ఉన్నత పాఠశాలకు సత్య ఎలక్ట్రికల్స్ సాయి కృష్ణ ఆధ్వర్యంలో సోమవారం 45 వేల విలువగల కంప్యూటర్‌ను వితరణ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు గద్దె గంగాధర్ మాట్లాడుతూ దాతృత్వానికి సాయి కృష్ణ నిలువెత్తు నిదర్శనమని అన్నారు. కృతజ్ఞతలు తెలిపి, మర్యాదపూర్వకంగా వారిని పూలమాల ,శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మ, మనోహర్, చంద్రకాంత్, నాగేష్, రాజమణి, హెప్జిభా, రాజన్న, సురేందర్, సురేష్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యంలో సుంకరి గంగాధర్‌కు డాక్టరేట్



సాహిత్యంలో డాక్టరేట్‌కు ఎన్నికైన గంగాధర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం వాడి గ్రామానికి చెందిన సుంకరి గంగాధర్ సమర్పించిన పరిశోధనకుగాను ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ పట్టా ప్రకటించింది. సారంగపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు స్కూల్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న సుంకర గంగాధర్ తెలంగాణ స్మృతి కవిత్వం సమగ్ర పరిశీలన' అనే అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. ప్రసిద్ధ కవి, పరిశోధకుడు డాక్టర్ నాళేశ్వరం శంకరం సుంకరి గంగాధర్ పరిశోధనకు పర్యవేక్షకునిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య సాగి కమలాకర్ శర్మ, ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య చింతకింది కాసిం, డాక్టర్ రఘు, ఆచార్య వారిజారాణి, డాక్టర్ సల్ల సత్యనారాయణ, డి. గోపాల్, ఘనపురం దేవేందర్, డాక్టర్ భాగ్యలక్ష్మి తదితరులు అభినందించారు.

బషీరాబాద్‌లో బోనాల ఊరేగింపు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్‌లో మల్లన్న స్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక యాదవ సంఘం ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాల మధ్య గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా బోనాలను ఆలయం వద్దకు తీసుకువెళ్లి స్వామివారికి సమర్పించారు. బోనాల ఊరేగింపు సందర్భంగా మహిళలు మంగళ హారతులు పట్టారు. అనంతరం స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కళ్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు, గ్రామ ప్రజలకు పెద్ద ఎత్తున అన్న వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షులు గణేష్, కార్యదర్శి దేవన్న, రాజు, అబ్బాస్, ముకేష్, గంగాధర్, మహేష్, చిన్నయ్య, నడ్పెన్న , రామక్రిష్ణ, ఆశన్న, భూమన్న, రాజు, అబ్బాస్, సాగర్, ముత్యం, చరణ్, దిలీప్, మహంత్, మల్లన్న స్వామి దీక్ష స్వాములు, సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

న్యూఢిల్లీలో ఎంపీని కలిసి జేఎంకెపిఎం రైతు ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్లు

- 20వేల స్క్వేర్ ఫీట్ల గోదాం మంజూరుకు సహకరించాలని వినతి



వినతి పత్రాన్ని అందజేస్తున్న సంఘం డైరెక్టర్లు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని మనోహరాబాద్ గ్రామ పసుపు రైతుల ఉత్పత్తిదారుల సంఘం జెఎంకెపిఎం డైరెక్టర్లు కొత్త ఢిల్లీలో నిజామాబాద్ పార్లమెంటు సభ్యులు అరవింద్‌ను కలిసినట్టు డైరెక్టర్ తిరుపతి రెడ్డి సోమవారం తెలిపారు. రైతు ఉత్పత్తిదారుల సంఘానికి 20వేల స్క్వేర్ ఫీట్ల గోదాంను ఎమ్మెస్మీ సబ్సిడీ ద్వారా మంజూరుకు సహకరించాలని వినతి పత్రాన్ని అందజేశారు. ఉత్పత్తిదారుల సంఘం ఎంఎస్ఎమ్ఈ నుండి మంజూరు కావడం వల్ల దాని నిర్మాణం పూర్తి చేసుకున్నాం కాబట్టి దాని ప్రారంభోత్సవానికి కేంద్ర ఎమ్మెస్మీ మంత్రి శోభ కరేంజలను పిలిపించి ఈ పరిశ్రమను ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్లు పాటుకూరి తిరుపతిరెడ్డి, పుప్పాల నాగేషు, కోలి రాజు, గడ్డం శ్రీనివాస్, గడ్డం లక్పతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రిటైనింగ్ వాల్ నిర్మాణానికి 10 లక్షలు మంజూరు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని తొర్తి గ్రామంలో వీర హనుమాన్ మందిరం వద్ద గల కాలువ వరద ఉధృతికి కోతకు గురై, నీరు రోడ్డుపైకి వస్తుండడంతో స్థానిక నాయకులు బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ సునీల్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన రిటైనింగ్ వాల్ (వరద నిలుపుదల చేసే గోడ) నిర్మాణానికి 10 లక్షల రూపాయలను ఎస్డీఎఫ్ నిధుల కింద మంజూరు చేయడంతో సోమవారం కాంగ్రెస్ నాయకులు కొబ్బరికాయ కొట్టి పనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా సునీల్‌రెడ్డికి గ్రామప్రజలు, నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు శివన్నోళ్ళ శివకుమార్, నాయకులు బెజ్జారం భాను, కార్యకర్తలు, గ్రామకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మైనారిటీలను చిన్న చూపు చూస్తున్న కాంగ్రెస్

నవతెలంగాణ-బాల్కొండ

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయిన కానీ మైనారిటీ నాయకులకు మంత్రి పదవి దక్కలేదని బీఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఎం ఏ. షాహిద్ అన్నారు. తెలంగాణ సాధించిన తర్వాత మైనారిటీలకు ప్రాధాన్యత ఇచ్చిన కెసిఆర్ రెండు దఫాలు మైనారిటీ మంత్రివర్గంలో స్థానం కల్పించారని మహమూద్ అలీని మొదటిసారి ఉపముఖ్యమంత్రిగా, రెండో దఫా లో హెూం శాఖ మంత్రిగా కేటాయించారని గుర్తు చేశారు.కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో మైనారిటీలకు మంత్రి పదవి దక్కలేదని, ఇక నైనా మైనారిటీ నాయకుడికి మంత్రి పదవి ఇచ్చి మైనారిటీలకు ప్రాధాన్యత ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

లిల్లీపుట్ పాఠశాలలో కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు



సైనికుల వేశధారణలో చిన్నారులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని లిల్లీపుట్ పాఠశాలలో కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులందరూ ఆర్మీ డ్రెస్‌లలో అందరినీ ఎంతగానో అలరించారు. కార్గిల్ విజయ్ దివస్ దినోత్సవం గురించి ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల కరస్పాండెంట్ రామకృష్ణ మాట్లాడుతూ.. అమరవీరులను వారి త్యాగాలను జ్ఞాపకం చేసుకోవడానికి దేశం కోసం సాయిధ దళాల పాత్రను బలోపేతం చేయడానికి విజయ్ దివస్ భారత దేశంలో జరుపుకుంటామని తెలిపారు. 1971 డిసెంబర్ 16న భారతదేశం పాకిస్థాన్‌తో తలబడి విజయాన్ని సాధించినందుకు విజయ్ దివస్ జరుపుకుంటామని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు చక్కగా పిరమిడ్‌తో దృశ్యంతో అందరినీ ఎంతగానో అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దాసు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- 94 ఫిర్యాదులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/ముప్కాల్/కంఠేశ్వర్

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 94 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, డీఆర్డీఓ సాయాగౌడ్, ఇంచార్జ్ డీపీఓ శ్రీనివాస్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిని మండల కేంద్రంలోనే నిర్మించాలి: జిల్లా ప్రజావాణిలో ఫిర్యాదు..

ముప్కాల్ : ముప్కాల్ మండల కేంద్రానికి మంజూరైన ప్రభుత్వ ఆసుపత్రిని మండల కేంద్రంలోనే నిర్మించాలని కోరుతూ ముప్కాల్ 'గ్రామపరిరక్షణ సమితి' ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సమితి అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్, ప్రధాన కార్యదర్శి సంజీవ్ థామస్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రికి అనువైన స్థలం లేదని మంజూరైన ఆసుపత్రిని వేరే గ్రామాలకు మళ్లించడం సరైంది కాదన్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ భూములను అధికారులు గుర్తించి ఆసుపత్రిని ఇక్కడే కట్టాలని విజ్ఞప్తి చేశామన్నారు. కబ్జాకు గురైన గ్రామ చెరువును సైతం సర్వే చేసి, హద్దులు పెట్టాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు నేర బాబు రావ్, కల్లు స్వామి, కంచు గంగాధర్, శంకర్ పటేల్, కట్ట గోపి తదితరులు పాల్గొన్నారు..



ముప్కాల్ : కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న గ్రామపరిరక్షణ సమితి సభ్యులు



కంఠేశ్వర్ : కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న సీపీఐ(ఎం)నాయకులు

ప్రజా సమస్యలపై నిరసన తెలిపే ధర్నా చౌక్‌లో సౌకర్యాలను మెరుగుపరచాలి: సీపీఐ(ఎం) డిమాండ్

కంఠేశ్వర్ : ప్రజా సమస్యల పరిష్కారంకోసం నిరసన తెలిపే ధర్నా చౌక్‌లో సౌకర్యాలను మెరుగుపరచాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకోవటానికి ప్రజలు వివిధ రూపాల్లో తమ నిరసన ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లటం సహజమని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్ దగ్గర ప్రజలు నిరసన వ్యక్తం చేయకుండా అధికారులు, పోలీసుల ద్వారా నియంత్రణ చేస్తూ ఎవరు కలెక్టరేట్ దగ్గర నిరసన వ్యక్తం చేయకుండా నోటీసులను ఇస్తూ కేసులను బనాయిస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదని అన్నారు. గతంలో కలెక్టర్ పాత కలెక్టరేట్ ఎదుట ధర్నా చౌక్‌ని కేటాయించినప్పటికీ సౌకర్యాలు లేకుండా ప్రజలకు ఎవరికీ నిరసన కనబడకుండా నాలుగు గోడల మధ్య బంధించినట్టుగా ఉందన్నారు. ఆ స్థలాన్ని చదును చేసి ప్రజలకు తాగునీటి సౌకర్యాన్ని, మహిళలకు పురుషులకు విడివిడిగా టాయిలెట్లను ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా నిరసన వ్యక్తం చేయటానికి షెడ్డును నిర్మించి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. లేనియెడల కలెక్టరేట్ వద్ద ప్రజలు నిరసన వ్యక్తం చేయటానికి అవకాశం కల్పించాలని ఆయన అన్నారు. అధికారులు వెంటనే జోక్యం చేసుకొని వసతులు కల్పించని యెడల రాజకీయ పార్టీలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేయాల్సి వస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట్ రాములు, నూర్జహాన్, శంకర్ గౌడ్, నాయకులు రాములు, తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ ఫిక్స్డ్ వేతనం ఇవ్వకపోతే పోరు తప్పదు

- సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్
- జిల్లాలో బస్సు యాత్రను ఆశ వర్కర్లు విజయవంతం చేయాలి



డిఎంహెచ్ఓకు వినతి పత్రాన్ని అందజేస్తున్న, సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్, ఆశావర్కర్లు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఆశా వర్కర్ ఫిక్స్ వేతనం 18వేలు ఇవ్వకపోతే పోరు తప్పదని సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ అన్నారు. సోమవారం ఆశా వర్కర్ల బస్సు జాత గురించి డిఎంహెచ్ ఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యల పైన జరుగుతున్న రాష్ట్ర బస్సు జాత ఈనెల 19న నిజామాబాద్ జిల్లాకు రానుందన్నారు. ఈ బస్సు జాతాలో జిల్లాలోని ఆశా వర్కర్లందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సబ్‌సెంటర్స్ క్లీన్ చేయడం, ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు సబ్ సెంటర్ డ్యూటీలు, బిపి, షుగర్ టెసులు చేయడం. ఎన్సిడి బుక్స్ రాయడం, డ్రైడే ఫ్రైడే, శుక్రవారం సభలు, ఆరోగ్య మహిళా, స్పుటమ్ డబ్బాలు మోయడం, కంటి వెలుగు, సమగ్ర సర్వే, ప్రజాపాలన సర్వేలు, అనేక సమావేశాలకు టిఏ, డిఏలు ఇవ్వకపోవటం. ఎగ్జామ్స్ డ్యూటీలు తదితర అనేక పనులను డబ్బులు లేకుండా ఆశాలతో రాష్ట్ర ప్రభుత్వం చేయిస్తుందన్నారు. పెరిగిన ధరలకనుగుణంగా పారితోషికాలను రూ.18వేలకు పెంచి ఫిక్స్డ్ వేతనం నిర్ణయించాలని, గత ప్రభుత్వ కాలంలో 15 రోజుల సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలు, కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల మేనిఫెస్టోలో ఆశాలకిచ్చిన హామీలు 2024 ఫిబ్రవరి 9న, జూలై 30న ఆరోగ్య శాఖా కమిషనర్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఆశాలు అనేక పోరాటాలు నిర్వహించారన్నారు. ఈ పోరాటాల ఫలితంగా ప్రింటెడ్ రిజిష్టర్స్ ఇచ్చారని, 2015లో 106 రోజులు ఆశాలు సమ్మె చేయగా ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.6వేలు ఫిక్సిడ్ వేతనం చెల్లిస్తామని ప్రకటించి అనంతరం పనిని బట్టి పారితోషికాలను నిర్ణయం చేశారని తెలిపారు. 2023లో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా 15 రోజులు రాష్ట్ర వ్యాప్తంగా ఆశాలు సమ్మె చేయగా హైదరాబాద్ కోఠి కమిషనర్ ఆఫీసు వద్ద సమ్మె ముగింపు సందర్భంగా ధర్నా సందర్భంగా ఆశాల సమస్యల పరిష్కారం కోసం ఒక కమిటీని వేస్తున్నామని చెప్పి బీఆర్ఎస్ ప్రభుత్వం చేతులు దులుపుకుందన్నారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కారం చేయకుంటే పోరాటాలు తప్పవని ఆమె హెచ్చరించారు. డిసెంబర్ 19న జిల్లాకు వస్తున్న జాతాలో ఆశా వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుకన్య, సారా, రేవతి, హసీనా, పర్వీన్, స్వప్న, సరిత, తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో దూకి వ్యక్తి ఆత్మహత్య



మృతి చెందిన సుధాకర్

నవతెలంగాణ-నవీపేట్

పోలీస్ స్టేషన్ పరిధిలోని యంచ గోదావరిలో దూకి మాడుగుల సుధాకర్ (42) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై వినయ్ కుమార్ సోమవారం తెలిపారు. నిజామాబాద్‌లోని పాటిగల్లికి చెందిన సుధాకర్ ఖానాపూర్ రైస్ మిల్లులో కూలి పని చేసేవాడు. ఆయన కు నరాల బలహీనతతో ఆరోగ్యం సహకరించకపోవడంతో మనస్తాపం చెందాడు. ఆదివారం భార్య లావణ్యకు బాసర గుడికి వెళ్లి వస్తానని చెప్పి బైక్‌పై వెళ్లాడు. బైక్, చెప్పులు అక్కడే వదిలేసి గోదావరిలో దూకాడు. సమాచారం మేరకు కుటుంబ సభ్యులు ఆదివారం మృతదేహంకోసం స్థానిక జాలరులతో వెతకగా మృతదేహం లభించలేదు. సోమవారం ఉదయం మృతదేహం లభించడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినయ్ కుమార్ తెలిపారు.

అటవీ సంపద పరిరక్షణకు కృషి చేయాలి

- ఫారెస్ట్ రేంజ్ అధికారి టీ. శ్రీనివాస్



నవతెలంగాణ-ఆర్మూర్

అటవీ సంపద పరిరక్షణకు, వన్యప్రాణుల రక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఫారెస్ట్ రేంజ్ అధికారి టి. శ్రీనివాస్ తెలిపా రు. సోమవా రం ఆయన మాట్లాడుతూ అటవీ ప్రాంతా లకు నిప్పు పెడితే పర్యావరణానికి, వన్యప్రాణులకు తీరని నష్టం జరుగుతుందని అన్నారు. అటవీ విస్తీర్ణం పెంచేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని అన్నారు. పర్యావరణ సమతుల్యతను వన్యప్రాణులను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. అడవికి నిప్పు అంటకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అటవీ భూములను ఎవరైనా కబ్జా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎఫ్ డి ఓ భవాని శంకర్ ఆదేశానుసారం అడవుల సంరక్షణకై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్టు తెలిపారు.

బీఎల్‌పీ రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక

- రాష్ట్ర అధ్యక్షులుగా దండి వెంకట్
- ప్రధాన కార్యదర్శిగా సిద్ధిరాములు ఎన్నిక



దండి వెంకట్



సిద్ధిరాములు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో ఈనెల 14,15తేదీల్లో బహుజన లెఫ్ట్ పార్టీ (బహుజన కమ్యూనిస్టు) బిఎల్‌పి రాష్ట్ర ప్రథమ మహాసభల్లో రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు సోమవారం తెలిపారు. కమ్యూనిస్టు ఉద్యమ ప్రస్థానంలో పని చేస్తున్న దండి వెంకట్‌ను బహుజన లెఫ్ట్ పార్టీ (బహుజన కమ్యూనిస్టు (బిఎల్‌పి రాష్ట్ర అధ్యక్షులుగా, ప్రధాన కార్యదర్శిగా ఎస్. సిద్ధి రాములును ఎన్నుకున్నట్టు వ్యవస్థాపక అధ్యక్షులు నల్లా సూర్యప్రకాష్ మీడియాకు తెలిపారు. వీరు బహు జన శ్రామిక వర్గ వృత్తి కులాలకు చెందిన వడ్డెర, పద్మశాలి నాయకత్వంలో మార్క్సిజం- అంబేద్కరిజం అన్వయింపుతో కూడిన కుల వర్గ జమిలి సైద్ధాం తిక రాజ కీయ కార్య క్రమం ద్వారా పని చేస్తున్న బహుజన లెఫ్ట్ పార్టీ(బహుజన కమ్యూనిస్టు) తెలంగాణలో బహుజన రాజ్యాధికారం సాధన లక్ష్యంగా పార్టీని బలోపేతం చేస్తారని ఆశిస్తున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షులు నల్లా సూర్యప్రకాష్ తెలిపారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా నల్లా సూర్యప్రకాష్ హైదరాబాద్, ఉపాధ్యక్షురాలిగా సబ్బని లత-నిజామాబాద్, ఉపాధ్యక్షులుగా ఆంజనేయులు సిరిసిల్ల జిల్లా, ఉపాధ్యక్షులుగా శ్రీశైలం నాగర్ కర్నూల్, కార్యదర్శులుగా ఎంఎం గౌడ్ సూర్యపేట జిల్లా, వడ్ల సాయి కృష్ణ-విశ్వకర్మ కామారెడ్డి జిల్లా, సహాయ కార్యదర్శిగా నాగారపు ఎల్లయ్య కామారెడ్డి, రాష్ట్ర కోశాదికారిగా మారోజు సునీల్ -రంగారెడ్డి జిల్లా, రాష్ట్ర కమిటి సభ్యులుగా బి. జగదీష్, గంగా శంకర్, రాజేందర్, దండు జ్యోతి, ఎస్.డి.సయ్యద్, గంగా మణి కామారెడ్డి, చాట్ల పోశవ్వ-నిర్మల్, సి.హెచ్. కళా నిర్మల్, మహిముద్ నిర్మల్, అరుణ నిర్మల్ ఎం.అజయ్ సిరిసిల్ల, శ్రీ హరి సిద్దిపేట మెదక్ రాజును ఎన్నుకున్నట్టు వ్యవస్థాపక అధ్యక్షులు నల్లా సూర్యప్రకాష్ తెలిపారు.

పేదల సమస్యలు పరిష్కరించేంతవరకూ పోరు

- ధర్మ సమాజ్ పార్టీ



ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న ధర్మ సమాజ్ పార్టీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రభుత్వం పేద ప్రజల సమస్యలు పరిష్కరిం చేంతవరకు పోరాటం తప్పదని ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు మహిపాల్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలో పేద, మధ్య తరగతి వర్గాలైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ ప్రజలకు విద్యా, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు సాధనకై ఆమరణ నిరాహార దీక్ష ధర్నాచౌక్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిపాల్ మాట్లాడుతూ.. ప్రజలందరికీ నాణ్యమైన ఉచిత విద్య, వైద్యాన్ని అందించాలన్నారు. ప్రజలందరికీ చేసుకోవడానికి ఉపాధి అందించాలని తెలిపారు. అర్హులైన వారందరికీ సాగునీటి సౌకర్యంతో ఒక ఎకరం వ్యవసాయ భూమిని ఇవ్వాలని పేర్కొన్నారు. అర్హులైన వారందరికీ 200 గజాల స్థలంలో నాలుగదుల ఇల్లు ని నిర్మించి ఇవ్వాలని సూచించారు. ఈ డిమాండ్స్‌ని గత నెల రోజుల నుంచి ప్రభుత్వం ముందు ఉంచుతూ జిల్లా కలెక్టర్, ఎమ్మార్వోలకు వినతిపత్రం ఇచ్చిన, ధర్నాలు నిర్వహించిన, రిలే నిరాహార దీక్షలు చేసిన ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. అందుకే ఈ ఆమరణ నిరాహార దీక్షలు చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ప్రేమ్ కుమార్, జిల్లా నాయకులు ప్రశాంత్, మురళి, మండలాల అధ్యక్షులు శుభాష్, గంగాధర్, మహేష్, కైలాష్, నిశాంత్, బిసి సంఘాల వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్‌గౌడ్, కెటవిపీఎస్ గంగాధర్, అంబెద్కర్ యువజన సంగం అధ్యక్షులు లింగన్న, ముఖ్య కార్యకర్తలు, పాల్గొన్నారు.

మెండోరాలో సెమీ క్రిస్టమస్ వేడుకలు



నవతెలంగాణ-మెండోరా

మెండోరా మండల కేంద్రంలో క్రైస్తవ సంఘాల యునియన్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్టమస్ వేడుకలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేడుకలకు హాజరైన అతిథులకు శాలువాలతో సన్మానించారు. ముఖ్య అతిథులుగా పాస్టర్ ఆనంద్ పాల్ హాజరయ్యారు. అనంతరం చిన్న పిల్లలు నృత్యాలతో అలరింపజేసి క్రీస్తు పుట్టుకను వివరిస్తూ ప్రజలను ఆకట్టుకునేలా నాటికను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి.ముత్యం రెడ్డి , గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, అంబేద్కర్ సంఘం సభ్యులు , పాస్టర్ ఆనంద్ , పాస్టర్ ఆశీర్వాదం , పాస్టర్ అసోసియేషన్ సభ్యులు తదితరులు హాజరైయ్యారు.

ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి పడి ఒకరు మృతి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

బైక్‌పై నుండి పడి గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని సుద్దపల్లి జాతీయ రహదారి 44, సిఎంసి మెడికల్ కాలేజ్ వద్ద ఆదివారం మధ్యాహ్నం సాంపల్లి గ్రామానికి చెందిన మార్కంటి జంగన్న (55) ఆటో డ్రైవర్ డిచ్‌పల్లి నుండి సాంపల్లి గ్రామానికి తన ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. ప్రమాదవశాత్తూ జాతీయ రహదారి పక్కన అదుపు తప్పి కింద పడడంతో తలకి బలమైన గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌హెచ్ఓ మోహమ్మద్ షరీఫ్ తెలిపారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు ఎస్‌హెచ్ఓ వివరించారు. మృతుని అన్న కొడుకు మార్కంటి మహేందర్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని మార్చురీకి తరలించినట్లు ఎస్‌హెచ్ఓ పేర్కొన్నారు.

అమీర్‌నగర్‌లో అన్నవితరణ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని అమీర్ నగర్‌లో సోమవారం సంత మల్లన్న జాతర ఉత్సవాల్లో భాగంగా శ్రీకృష్ణ స్థానిక యాదవ సంఘం ఆధ్వర్యంలో అన్న వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంత మల్లన్న జాతర సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, కానుకలు సమర్పించుకున్నారు. అన్న వితరణలో పాల్గొన్నారు. జాతర ఉత్సవాలలో భాగంగా ఆలయం వద్ద షిడి ఊరేగింపును నిర్వహించారు. కార్యక్రమంలో కమ్మర్పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాలవత్ ప్రకాష్, శ్రీ కృష్ణ యాదవ సంఘం అధ్యక్షులు జిల్లా పెద్ద మల్లేష్, ఉపాధ్యక్షులు నడిపి రాజన్న, సభ్యులు నడిపి రాజేష్, సంత పెద్ద లింగన్న, ఎడ్ల దత్తయ్య, గణేష్, సంఘ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ రిజర్వేషన్ కల్పించండి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇందల్ వాయి మండలంలోని నల్లవెల్లి గ్రామానికి ఎస్సి రిజర్వేషన్ అమలు చేయాలని కోరుతూ కొందరు నాయకులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుకు వినతి పత్రం అందజేసినట్లు వారు తెలిపారు. వినతిపత్రం స్వీకరించిన అనంతరం కలెక్టర్ సానుకూలంగా స్పందించి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని తెలిపినట్లు గ్రామ ఎస్సీ నాయకులు విలేకరులకు తెలిపారు.

ఎస్సైని సన్మానించిన ఆర్.టి.ఐ బృందం



నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ ఎస్సై సుధాకర్‌ను ఆర్.టి.ఐ బృందం సభ్యులు సోమవారం సన్మానించారు. మండల కేంద్రానికి నూతనంగా వచ్చిన సుధాకర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ - 2005 రాష్ట్ర కార్యదర్శి లేగ్గేల రాజు, జిల్లా సలహాదారులు మదర్‌పాషా, దండుగుల లింగమయ్య, సామ్రాట్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రథోత్సవం



రథోత్సవం నిర్వహిస్తున్న పలువురు

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమం వద్ద రథోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. రంగురంగుల విద్యుత్ కాంతులతో రకరకాల పూల తోరణాలతో అలంకరించిన రథాన్ని పాతబసుల వరకు భక్తి పాటలతో ఆటలతో తీసుకువెళ్లారు. ఈ రథాన్ని భక్తులు అత్యంత శ్రద్ధతో తిలకించారు. ఈ కార్యక్రమంలో నరసింహులు, రాజాగౌడ్, రాజేశ్వర్‌రెడ్డి, బి.రాములు, గంగారెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులను పరిష్కరించండి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్
- కలెక్టరేట్‌లో ఫిర్యాదుల స్వీకరించిన కలెక్టర్
- పలు మండల కేంద్రాల్లోనూ ప్రజావాణి

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పరిశీలించి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. భూ సంబంధిత సమస్యలు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, అంగన్‌వాడీ భవనాలు, తదితర సమస్యలపై ప్రజావాణిలో అర్జీలను దరఖాస్తుదారులు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పరిశీలించి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇప్పటి వరకు ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులపై సమీక్షిస్తూ, ఆయా అధికారులు చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే వేగవంతం చేయాలని, మండల అధికారులు సూపర్ చెక్ చేయాలని అన్నారు. అవసరమైన లాగిన్‌లు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. ఇంటింటి సమగ్ర సర్వే ఆన్‌లైన్‌లో పొందుపరచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వి.విక్టర్, శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీఓ రంగనాథ్‌రావు, జడ్పీ సీఈవో చందర్, పలు శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డి: ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

డెత్ సర్టిఫికెట్ ఇవ్వలేదని ఫిర్యాదు



భిక్కనూర్ : మండలంలోని సిద్దరామేశ్వరంనగర్ గ్రామానికి చెందిన తిరుమలయ్య తల్లి మరణానికి చెందిన మరణ ధ్రువీకరణపత్రాన్ని గ్రామపంచాయతీ కార్యదర్శి ఇవ్వడం లేదని సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి అఖిలను వివరణ కోరగా మరో గ్రామం నుంచి ఇటీవల కాలంలో సిద్ధ రామేశ్వరనగర్ గ్రామానికి బదిలీపై వచ్చినట్టు తెలిపారు. డిజిటల్ కీ అందుబాటులో లేని కారణంగా మరణ ధ్రువీకరణ పత్రం ఇవ్వడానికి ఆలస్యం జరిగిందని తెలిపారు. త్వరలోనే సమస్య పరిష్కారం చేసి మరణ ధ్రువీకరణ పత్రం కుటుంబ సభ్యులకు అందజేయనున్నట్టు పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

నెమలిగుట్ట తండాలో ప్రభుత్వ భవనాలు నిర్మించాలి



కామారెడ్డి : నెమలిగుట్ట తండాలో ప్రభుత్వ భవనాలు నిర్మించాలని కోరుతూ మాచారెడ్డి మండలం నెమలిగుట్ట తాండకు చెందిన పలువురు నాయకులు కామారెడ్డి కలెక్టర్ కార్యాలయం ప్రజావాణిలో వినతి పత్రాన్ని అందజేశారు. గత పది సంవత్సరాల క్రితం తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వం నూతన గ్రామపంచాయతీలను ఏర్పాటు చేసిందని, గ్రామపంచాయతీకి కావాల్సిన పంచాయతీ భవనం, పాఠశాల, అంగన్వాడీ తదితర భవనాలను నిర్మించడం మర్చిపోయిందని తెలిపారు. నేడు ఆ తండాల్లోని ప్రజలు గ్రామపంచాయతీ భవనం, అంగన్వాడి భవనం ఇతర భవనాలు లేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు సభావత్ రవి, బానోత్ కిషన్, జిల్లా అధ్యక్షులు మాలోత్ హరిలాల్ నాయక్, జిల్లా కార్యదర్శి దాసరి శ్యామ్‌లతో కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి భవనాలు నిర్మించేలా ఏర్పాట్లు చేయాలని కోరారు.

పురోహితుడు భరత్ భూషణ్ జోషి మృతి

- గ్రామంలో విషాదఛాయలు



భరత్ భూషణ్ జోషి(ఫైల్)

నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రానికి చెందిన ప్రముఖ పురోహితుడు భరత్ భూషణ్ జోషి సోమవారం ఉదయం మృతి చెందాడు. గత 60 సంవత్సరాలుగా ఈయన మండల కేంద్రంలో పురోహిత్యం నిర్వహిస్తున్నారు. గాంధారిలో ఏ శుభకార్యం జరిగినా ఆయన ముందుండి కార్యక్రమాలు నిర్వహించేవాడు. భరత్ భూషణ్ జోషికి నాలుగైదు జిల్లాల్లో మంచి పురోహితులని పేరుంది. ఆయన మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన మృతి పట్ల ఎమ్మెల్యే మదన్ మోహన్, మాజీ ఎమ్మెల్యే సురేందర్, ఏనుగు రవీందర్‌రెడ్డి, మాజీ మంత్రి నేరెళ్ల ఆంజనేయులు, మాజీ జెడ్పిటిసి సభ్యుడు తానాజీరావు, మాజీ సర్పంచ్ మమ్మాయి సంజీవ్, కాంగ్రెస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు తూర్పు రాజు వివిధ పార్టీల నాయకులు తదితరులు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కడుపునొప్పి భరించలేక వృద్ధుడు ఆత్మహత్య



మృతి చెందిన పోచయ్య

నవతెలంగాణ-గాంధారి

కడుపునొప్పి భరించలేక వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని రాంపూర్ గడ్డలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ గణేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సంపంగి పోచయ్య (60) అనే వ్యక్తి గత కొన్ని రోజులుగా తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఆదివారం ఉదయం తీవ్రమైన కడుపునొప్పి రావడంతో కడుపు నొప్పి భరించలేక గ్రామ శివారులో పురుగుల మందు మందు తాగి ఆత్మహత్యా ప్రయత్నం చేశాడు. గుర్తించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం బాన్సువాడ ఆసుపత్రికి తరలించా రు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం రాత్రి మృతిచెందాడు. మృతుని భార్య సాయవ్వ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

హూన్సలో మొరం రోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలంలోని హూన్స గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మొరం రోడ్డు పనులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎంసీ వైస్ చైర్మెన్ చీల శంకర్ మాట్లాడుతూ.. రైతుల, గ్రామస్థుల సౌకర్యార్థం ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో భాగంగా 5 లక్షల రూపాయలతో గ్రావెల్ రోడ్డు పనులు చేపట్టినట్టు తెలిపారు. రైతుల సౌకర్యార్థం గ్రామీణ ప్రాంతంలో గ్రావెల్ రోడ్లు మంజూరు చేసిన బోధన్ శాసనసభ్యులు సుదర్శన్‌రెడ్డికి గ్రామస్థుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మండలాధ్యక్షులు నాగేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ దాము, సొసైటీ చైర్మెన్ మంధర్నా రవి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వై.నరేందర్‌రెడ్డి, సాలూర సొసైటీ చైర్మన్ అల్లే జనార్ధన్, నాయకులు అల్లే రమేష్, గ్రామ రైతు నాయకులు పల్లె గంగారం, మురుగే శంకర్, ఈరాయప్ప మహారాజ్, సొసైటీ డైరెక్టర్లు మార్కల్ శివకుమార్, దేశ్‌పేట్ రాములు, మురుగే మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

బూత్ అధ్యక్షులకు సన్మానం



నవతెలంగాణ-సదాశివనగర్

తెలంగాణ రాష్ట్ర భారతీయ జనతా పార్టీ ఆదేశాల మేరకు ప్రతీ బూత్ నూతన అధ్యక్ష కమిటీలను నియమించారు. అందులో భాగంగా మండలంలోని మర్కల్ గ్రామ బూతు65కు సాయిలు, 66 కుంట సుభాష్‌రెడ్డిని నూతన అధ్యక్షులుగా నియమించారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు కుంట రాంరెడ్డి, ఉపాధ్యక్షులు చక్రధర్‌గౌడ్, గొల్ల ప్రవీణ్, మండల కార్యవర్గ సభ్యులు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపుల ఐక్యత చాటి చెప్పాలి

- రాష్ట్ర అగ్రోస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు



మాట్లాడుతున్న రాష్ట్ర అగ్రోస్ కార్పొరేషన్ చైర్మన్

నవతెలంగాణ-బిచ్కుంద

మున్నూరు కాపు కులస్తులు ఉద్యోగ, వ్యాపార, రాజకీయలతో పాటు తదితరంగాల్లో అభివృద్ధి చెంది ఐక్యత చాటి చెప్పాలని రాష్ట్ర ఆగ్రోస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ అన్నారు. జుక్కల్ నియోజకవర్గస్థాయి మున్నూరు కాపుల ఆత్మీయ సమ్మేళన సభ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా మున్నూరు కాపు సంఘం నుంచి బస్టాండ్ ప్రధాన వీధుల గుండా బండాయప్పా కళ్యాణ మండపం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ముందుగా సభా ప్రాంగణంలో జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి నూతనంగా ఎన్నుకైన మున్నూరు కాపు జిల్లా అధ్యక్షులు ఆకుల శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. మున్నూరు కాపులు వ్యవసాయాన్ని నమ్ముకుని జీవిస్తూ ఇతరులకు సాయంచేసే గుణం ఉన్నవారని మున్నూరు కాపులు విద్యాపరంగా, రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని అన్నారు. సమాజంలో తమకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకోవాలన్నారు. మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ దఫేధర్ రాజు మాట్లాడుతూ.. మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసి మున్నూరు కాపు కులస్తులు అభివృద్ధికి తోడ్పడాలని, రాబోయే స్థానిక ఎన్నికల్లో అత్యధికంగా మున్నూరు కాపు కులస్తులను గెలిపించుకొని సత్తా చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో మామిడ్ల అంజయ్య, ఉగ్గె శ్రీనివాస్, బండివార్ విజయ్, జయ ప్రదీప్, అస్పత్‌వార్ వినోద్, కాసుల రోహిత్, మాజీ ఏఎంసీ చైర్మన్ శ్రీహరిరాజు, అరవింద్, నాగనాథ్, పాకల విజయ్, సోపాన్‌సార్, నియోజకవర్గస్థాయి మున్నూరు కాపు కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

చలో బిచ్కుందకు తరలిన మున్నూరు కాపులు..

మద్నూర్ : బిచ్కుంద మండల కేంద్రంలోని బండయప్ప ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన మున్నూరు కాపు మహాసభకు మద్నూర్ మండలం నుంచి మున్నూరు కాపులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు.



లింగంపేట్: సర్వే నిర్వహిస్తున్న పలువురు



సదాశివనగర్‌లో...

ఇందిరమ్మ ఇండ్ల సర్వే

నవతెలంగాణ-లింగంపేట్/గాంధారి/సదాశివనగర్

మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను సోమవారం నిర్వహించారు. ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్‌మోహన్ రావు ఆదేశానుసారం ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి కుటుంబాల వద్దకు వెళ్లి సర్వే నిర్వహించారు. వారి కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా సర్వే చేపడుతున్నట్టు తెలిపారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లను కచ్చితంగా ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరేష్, లింగంపేట్ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు బుర్ర నారాగౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జొన్నల రాజు, లింగంపేట్ పట్టణ అధ్యక్షులు ప్రసాద్‌గౌడ్, సమన్వయ కమిటీ సభ్యులు పంజరి ఎల్లమయ్య, అశోక్, మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ నగేష్, యూత్ మండలాధ్యక్షులు రాజు, లింగంపేట్ మాజీ ఉప సర్పంచ్ కౌడ రవి, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్ కుమార్, కిరణ్, సలీం తదితరులు పాల్గొన్నారు.

గాంధారి : మండల కేంద్రంలో సోమవారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా సెక్రెటరీ లైన్ రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సయ్యద్ అహ్మద్, సాకలి సాయిరామ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్ : మండలంలోని అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను చేపడుతున్నారు. మండలంలోని కల్వరాల్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను కార్యదర్శి సందీప్ సర్వే చేపట్టారు. ప్రతి ఇంటికి వెళ్లి వారి వివరాలను సేకరించినట్టు ఆయన తెలిపారు. ఆయన వెంట కారోబర్ భూమన్న తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ సర్వేలో పాల్గొన్న మద్దెల బాగయ్య..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ గృహ సర్వేలో భాగంగా సదాశివనగర్ మండల కేంద్రంలోని సర్వే నిర్వహిస్తున్న గ్రామపంచాయతీ కార్యదర్శితో ఎస్సీ విభాగం కామారెడ్డి జిల్లా అధ్యక్షులు మద్దెల బాగయ్య, నాయకులు వడ్ల రాజేందర్, గ్రామ అధ్యక్షులు చిందం రాజయ్య, ఎస్సీ సెల్ మండల జనరల్ సెక్రెటరీ జనరల్, ఇందిరమ్మ కమిటీ నాయకులు లింబారెడ్డి, మాజీ ఎంపిటిసి బీరయ్య, సీనియర్ నాయకులు ఆస రాజు, జంగం, ప్రభు స్వామి, పెసర సాయిలు, బింగి సత్యం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షులు మద్దెల బాగయ్య మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రజా పరిపాలన అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయా గ్రామాల్లో జరిగే ఇందిరమ్మ గృహ సర్వేలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు సర్వే చేసే అధికారుల వెంట ఉండి ఇందిరమ్మ గృహాల కోసం అప్లై చేసుకున్న కుటుంబాల వద్దకు వెళ్లి వారికి సహకరించాలని కోరారు.

వైభవంగా శబరిమాత పాదుకా పూజోత్సవ వేడుకలు



శబరిమాత వేడుకలో ఊరేగింపుగా వస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-తాడ్వాయి

శబరిమాత 54 ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారి పాదుకాపూజోత్సవం అత్యంత వైభవంగా నిర్వ హించినట్టు ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ఉదయం సుప్ర భాతం ధ్యానంతో గురు గీత పారాయణంతో ప్రారంభించి రంగురంగుల పూలతో అలంకరించిన పల్లకిలో పాదుకాలు ఉంచి భజనలతో గ్రామంలోని వీధుల గుండా ఊరేగిం చారు. అనంతరం గుట్టపై అలంకరించిన వేదికపై వేదమంత్రాలతో పాదుకాపూజోత్సవాలు నిర్వహించారు. తాడ్వాయి, ఎంగ్రియాల్, ఆదిలాబాద్, గాంధారి, కరీంనగర్, మహారాష్ట్ర బృందాలచే సంగీత విభావరి వినిపించారు. అనంతరం మాతాజీ భజన వీడియో ద్వారా ప్రదర్శింపజేశారు. ఈ ఉత్సవాలకు వచ్చిన భక్తులకు అన్నదాన సౌకర్యం ఏర్పాటు చేశారు. స్థానిక పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆంజనేయులు, రామలింగం, బండారి సంజీవ్, ముదాం నరసింహులు, మేకల రాజు, అంబీర్ శ్యామ్‌రావు, రాజాగౌడ్, వెంకటరెడ్డి, సుధాకర్‌రావు, రాజిరెడ్డి, రాఘవరెడ్డి, అనిల్‌రెడ్డి, బాలకిషన్ రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మార్వో బిక్షపతి

నవతెలంగాణ-నిజాంసాగర్

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మార్వో బిక్షపతి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని వివిధ శాఖల అధికారులు ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్నప్పటికీ ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాలేదని ఆయన అన్నారు.

ప్రజా సమస్యలపై నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని మండలంలోని ప్రజలందరూ కూడా వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఫిర్యాదు చేసిన సమస్యలపై తక్షణమే స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి గంగాధర్, మండల పంచాయతీ అధికారి అనిత, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బీడీ పెన్షన్ల పెంపుపై అసెంబ్లీలో మాట్లాడాలి

నవతెలంగాణ-తాడ్వాయి

బీడీ కార్మికుల పెన్షన్లు మంజూరు పెంచే విషయంపై ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు అసెంబ్లీలో మాట్లాడాలని కోరుతూ బీడీ కార్మికులు, పేదలు గ్రామంలో రెడ్డిగారి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. గత సంవత్సరం నుంచి పెన్షన్లు ఏ ఒక్కరికీ మంజూరు చేయలేదని, ఎన్నికల సమయంలో 4016కు పెంచుతామని ఇచ్చిన హామీ మరిచిపోయారని ఇప్పటికైనా మండలంలోని పేదలకు కొత్త పెన్షన్‌లు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీడీ కార్మికులు, పేదలు తదితరులు పాల్గొన్నారు.

సీఐఎస్‌ఎఫ్‌కు ఎంపికైన అభ్యర్థికి సన్మానం



ఎంపికైన భగత్‌ను సన్మానిస్తున్న విలేకరులు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పద్మాజివాడి గ్రామానికి చెందిన నవతెలంగాణ విలేకరి మామిండ్ల లింగం కుమారుడు మామిండ్ల భగత్ ఇటీవల ఎస్ఎస్‌సీ జీడీలో సీఐఎస్‌ఎఫ్ ఉద్యోగానికి ఎంపికవడంతో తోటి విలేకరులు నర్సగౌడ్, ఎండీ రఫీక్ భగత్‌ను శాలువాతో సన్మానించారు. అనంతరం మిఠాయిలు తినిపించి అభినందించారు. అనంతరం భగత్ తల్లిదండ్రులు సవిత లింగంకు శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే మదన్మోహన్‌కు మంత్రి పదవి రావాలి

- శివాలయంలో రుద్రాభిషేకం

నవతెలంగాణ-గాంధారి

ఎమ్మెల్యే మదన్మోహన్‌కు మంత్రి పదవి రావాలని కోరుకుంటూ మండలంలోని చిన్నపోతంగల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు బండి లక్ష్మణ్ దంపతులు శివాలయంలో సోమవారం రుద్రాభిషేకం చేశారు. ఈ ఈ సందర్భంగా బండి లక్ష్మణ్ మాట్లాడుతూ చిన్నపోతంగల్ గ్రామ కాంగ్రెస్ కమిటీ తరపున ఎమ్మెల్యే మదన్మోహన్‌కు మంత్రి పదవి కల్పించాలని పార్టీ తరపున రుద్రాభిషేకం నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

ఘనంగా మహా పడిపూజ



మహా పడిపూజ నిర్వహిస్తున్న అయ్యప్ప స్వాములు

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలోని అయ్యప్ప స్వాముల మహా పడి పూజను ఉదయ గురుస్వామి, కన్నయ్య జయ పంతులు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర హైకోర్ట్ సీనియర్ న్యాయవాది మహమ్మద్ మోహిన్ అహ్మద్ ఖాద్రి ఫామ్ హౌస్‌లో ఉత్తర శబరిమల అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో మహా పడిపూజను ఏర్పాటు చేశారు. అయ్యప్ప మహా పడిపూజలో పైడ్డి ఎల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు ఉదయ్, చంద్రమౌళి, రవిగౌడ్, శ్రీకాంత్, కృష్ణంరాజ్, నాగేష్, రాజురెడ్డి, గౌతమ్, సంతోష్‌గౌడ్, సిద్ధగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యులకు దుప్పట్లు పంపిణీ

నవతెలంగాణ-బోధన్

రోడ్డు పక్కన, బస్టాండ్ వద్ద నిద్రిస్తున్న అభాగ్యులకు ఆదివారం రాత్రి లయన్స్ క్లబ్ ఆఫ్ ఆచన్‌పల్లి ప్రతినిధులు దుప్పట్లు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ ప్రతినిధి రాజశేఖర్ జన్మదినం సందర్భంగా నిరుపేదలకు, చింతకుంట వృద్ధాశ్రమంలో అనాథలకు, వలస కూలీలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సాంబిరెడ్డి, సెక్రటరీ గణపతిరెడ్డి, ట్రెజరర్ శ్రీకాంత్, నాయిని కృష్ణ, లక్ష్మీకాంత్‌రెడ్డి, శ్రీనివాసరావు, చక్రవర్తి, బలరాం రెడ్డి, దుర్గారావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల సర్వే

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండలంలోని పల్లికొండ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే పారిశుధ్య పనులను సోమవారం పరిశీలించారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా లబ్దిదారులను ఎంపిక చేయనున్నామని ఎంపీడీవో, గ్రామ సెక్రెటరీ రామ్ మోహన్ తెలిపారు. మొదటి సంవత్సరంలో ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇండ్లను కేటాయిస్తారన్నారు. ఒక్కో ఇంటికి రూ.5లక్షల చొప్పున నిధులను ధపాలు వారీగా ఇస్తారని తెలిపారు. ప్రభుత్వం అందించే 400 చదరపు అడుగుల డిజైన్‌ను అనుసరించాల్సిన పనిలేదనన్నారు. స్థలం ఉంటే 500 చదరపు అడుగుల్లోనూ ఇల్లు కట్టుకునేందుకు వెసులుబాటు కల్పించిందని గ్రామస్తులకు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్ కుమార్, గ్రామ సెక్రెటరీ రామ్ మోహన్, కారోబర్, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.


సర్వేను పరిశీలిస్తున్న అధికారి

సాఫ్ట్‌బాల్ జిల్లా సీనియర్ ప్రాపబుల్స్ జట్ల ఎంపిక

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జడ్పిహెచ్ఎస్ బాయ్స్ హైస్కూల్ క్రీడా మైదానంలో సీనియర్ సాఫ్ట్ బాల్ పురుషులు, మహిళల ప్రాపబుల్స్ జట్లను ఎంపిక చేసినట్లు జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు వి ప్రభాకర్ రెడ్డి ప్రధాన కార్యదర్శి మర్యంటి గంగా మోహన్ సోమవారం తెలిపారు. జనవరి మొదటి వారంలో శిక్షణ శిబిరం నిర్వహించి తుది జట్టును ఎంపిక చేసి రాష్ట్ర పోటీలకు పంపుతామన్నారు. ఈ యొక్క ఎంపికను జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉప్పల లక్ష్మీ నరసయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనవరి రెండవ వారంలో జరిగే రాష్ట్ర పోటీలలో జిల్లా జట్టును ప్రథమ స్థానంలో నిలపడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సొప్పరి వినోద్, జిల్లా సాఫ్ట్ బాల్ కోచ్‌లు ఈ.నరేష్, హెచ్ అనికేత్, కె.సంజీవ్, మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

- ముగ్గురు మహిళలు, విటుడు అరెస్ట్
- 3500 నగదు స్వాధీనం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని బోర్గాం ప్రాంతంలో వ్యభిచార గృహంపై దాడి చేయగా ముగ్గురు మహిళలు, విటుడుని అదుపులోకి తీసుకున్నామని, వారి వద్ద నుండి 3500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు నిజామాబాద్ సిసిఎస్ ఏసిపి నాగేంద్ర చారి సోమవారం తెలిపారు. నగరంలోని బోర్గా కల్లుబట్టి పక్కనగల వ్యభిచార గృహంపై దాడి చేసినట్లు తెలిపారు. అనంతరం సంబంధిత ప్రాంతంలో గల పోలీస్ స్టేషన్లో అప్పగించామన్నారు.

కాంతి హైస్కూల్లో షీ టీం అవగాహన సదస్సు


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న షీటీం కానిస్టేబుళ్లు, ఉపాధ్యాయులు

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ కాంతి హై స్కూల్‌లో సోమవారం సబ్ డివిజాన్ షీ టీం బృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు, మహిళలతో ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తించిన లేదా టీచింగ్ చేసిన వెంటనే షీ టీంకు సమాచారం అందించాలని తెలిపారు. మహిళలు అప్రమత్తంగా ఉండాలని, సమస్య వచ్చినప్పుడు భయపడకుండా షీటీంను ఆశ్రయించాలని సంబంధిత అధికారులకు సమాచారం అందించడానికి సెల్ నంబర్,:8712659795 లేదా100 నంబర్లను సంప్రదించాలని తెలిపారు. విద్యార్థులకు కొన్ని యదార్థ సంఘటనలు వివరించి పిల్లలకు అవగాహన కల్పించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు . కార్యక్రమంలో షీ టీం కానిస్టేబుళ్లు సుమతి, విగ్నేష్, కాంతి గంగారెడ్డి, డైరెక్టర్ శశాంక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు జూనియర్ బాలుర కబడ్డీ సెలక్షన్స్

నవతెలంగాణ-ముప్కాల్

జనగామ జిల్లా కేంద్రంలో ఈ నెల 27 నుంచి 30 వరకు జూనియర్ అండర్-20 బాలుర ఇంటర్ డిస్ట్రిక్ట్ కబడ్డీ ఛాంపియన్ షిప్ పోటీలలో పాల్గొనే జిల్లా కబడ్డీ జట్టు సెలెక్షన్స్‌ను నేడు ఉదయం 10 గంటలకు ముప్కాల్ మండల కేంద్రంలోని 'భూదేవ్ ఇండోర్ స్టేడియం' లో చేపట్టనున్నట్టు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు అంద్యాల లింగయ్య ప్రధాన కార్యదర్శి కె.గంగాధర్ రెడ్డిలు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాల్గొనే క్రీడాకారులు 2005 జనవరి 12కు ముందు జన్మించిన వారికి అర్హత లేదని తెలిపారు. బరువు 70కిలోల మించకూడదని సూచించారు. వయస్సు నిమిత్తం పదోతరగతి, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతో ఉదయం 10 లోపు హాజరుకావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఈ క్రింది 9618088086 నంబర్‌ని సంప్రదించాలని సూచించారు.

ఆలయ పున:నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని వేంపల్లి గ్రామంలోని 'శ్రీ రాజరాజేశ్వర స్వామి' ఆలయ పుననిర్మాణ కార్యక్రమంలో భాగంగా సోమవారం భూమిపూజ చేపట్టారు. అనంతరం గ్రామంలో ఊరేగింపు, యజ్ఞం, మహిళలు భగవంతునికి ప్రత్యేక పూజాలు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వేంపల్లి. గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, పాల్గొన్నారు..

అదనపు గదులు ప్రారంభం

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని వేంపల్లి ప్రాథమిక పాఠశాలలో నూతనంగా నిర్మించిన ఆదనపు గదులను సోమవారం ప్రారంభించారు. గ్రామస్తుల సహకారంతో మూడు ఆదనపు గదులను నిర్మించి ప్రారంభించి నట్టు పాఠశాల ఎస్ఎంసీ ఛైర్మన్ తొగరి రామకృష్ణ యాదవ్ తెలిపారు. గదుల నిర్మాణానికి సహకారాన్ని అందించిన గ్రామస్తులు, పాఠశాల ఉపాధ్యాయులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ చైర్మన్ తేలు దినేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం, కమిటీ సభ్యులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.


అదనపు గదిని ప్రారంభిస్తున్న దృశ్యం

మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లక్ష్మణ్ నియామకం

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జిల్లాకు చెందిన నీరడి లక్ష్మణ్‌ను నియమించారు. సోమవారం మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియామక పత్రాన్ని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు తాళ్లపల్లి రవి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత రాజ్యాంగంలో షెడ్యూల్ కులాలకు పొందుపరిచిన హక్కుల పరిరక్షణ ఉద్యమంలో వర్గీకరణ వ్యతిరేకిస్తూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచన విధానంతో గత కొన్ని సంవత్సరాలుగా క్రియాశీలక కార్యకర్తగా మాల మహానాడు సంస్థలో పనిచేయుచున్న నీరడి లక్ష్మణ్‌ను నియమించారు. వీరి పదవికాలం 2 రెండు సంవత్సరాల వరకు కొనసాగుతుందన్నారు. మూడు నెలల కాలంలో రాష్ట్ర కమిటీలు జిల్లా కమిటీలను వేయాలని సూచించారు. మాల మహానాడు జాతీయ కమిటి ఆదేశాల మేరకు క్రమ శిక్షణతో పనిచేయాలని లేనిఎడల వారిని పదవి నుంచి తొలగించే అధికారం జాతీయ కమిటికి ఉంటుందని తెలిపారు.

చెవిలో పువ్వులు పెట్టుకుని ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల నిరసన

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో గల ఎన్టీఆర్ చౌరస్తా వద్దగల ధర్నా చౌక్‌లో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో 10వ రోజు సమ్మెలో భాగంగా చెవిలో పువ్వులు పెట్టుకొని వినూత్నంగా నిరసన వ్యక్తంచేశారు ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజు, భూపేందర్ మాట్లాడుతూ పది రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవట్లేదని అన్నారు. ఈ దీక్షలకు ధర్మ టీచర్స్ యూనియన్ జిల్లా నాయకులు బాగేంద్ర మహారాజ్, రాజు, రమేష్, ప్రవీణ్ మహారాజ్, జి.సంతోష్, జేత్రీ, పీఆర్‌టియు నాయకులు హరిచరణ్, దేవానంద్, సివి నరసింహారావు, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్, మహిళా అధ్యక్షురాలు గంగామణి, నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగులు విద్యాశాఖలో భాగమే
జాక్టో చైర్మన్ చీమల శ్రీకాంత్

కంఠేశ్వర్:ఎస్ఎస్ఏ ఉద్యోగులు విద్యాశాఖలో భాగమేనని జాక్టో చైర్మన్ చీమల శ్రీకాంత్ అన్నారు. పది రోజులుగా తమ న్యాయమైన డిమాండ్స్ కోసం నిరవధిక సమ్మె చేస్తున్న సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. అసెంబ్లీ ఎలెక్షన్‌కు ముందు అప్పటి పీసీసీ అధ్యక్షులు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చిన విధంగా వెంటనే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులకు అన్నివేళలా అండగా ఉంటామని, అధైర్య పడవలసిన అవసరం లేదని అన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ అధ్యక్షులు సన ఉద్దీన్ పాల్గొన్నారు.


నిజామాబాద్‌సిటీ : చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

కళల్ని, క్రీడాకారులను ఎల్లప్పుడూ ప్రోత్సహించాలి

- డాక్టర్ హరికృష్ణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

కళల్ని, క్రీడాకారులను ఎల్లప్పుడూ ప్రోత్సహించడం ద్వారా సమాజం ఎప్పుడు ఐక్యమత్యంతో ఉటుందని ఇలాంటి కార్యక్రమాలకు ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తూ ఉంటానని శ్రీ మహాలక్ష్మి పిల్లల ఆసుపత్రి డాక్టర్ హరికృష్ణ అన్నారు. సోమవారం ఆఫీసర్స్ క్లబ్‌లో నిర్వహించిన గోర్ బంజారా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో ఆయన పాల్గొన్నారు. మూడు రోజులపాటు టోర్నీ నిర్వహణకు కృషి చేసిన ఉపాధ్యాయుడు ప్రకాశ్, ఏవో గంగారాం, వైద్యారోగ్యశాధికారి ప్రతాప్ సింగ్, దేవిసింగ్‌కు హరికృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో మొట్టమొదటిసారి బంజారా స్పోర్ట్స్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతి సంవత్సరం డిసెంబర్‌లో గోర్ బంజారా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా టోర్నీ నిర్వాహకులు హరికృష్ణతోపాటు ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాను సన్మానించారు.


తాహెర్‌బిన్, నిర్వాహకులను సన్మానిస్తున్న పలువురు

మృతుని కుటుంబానికి 62,300 అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న యువత

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని సుద్దపల్లి గ్రామానికి చెందిన మేకల హరీష్ పది రోజుల క్రితం గల్ఫ్‌లోని దుబాయిలో గుండెపోటుతో మరణించగా బాధిత కుటుంబానికి రూ. 62,300 సోమవారం అందజేశారు. సుద్దపల్లి గ్రామ యువజన సంఘాలు, చుట్టుపక్కల గ్రామ యూత్ సంఘాలు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పానుగంటి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో చందాల రూపంలో జమ చేసిన మొత్తం రూ. 62,300 మృతుని భార్య రాజమణికి అందజేశారు. ఈ సందర్భంగా పానుగంటి సతీష్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం గల్ఫ్‌లో చనిపోయిన కుటుంబాలకు 5 లక్షలు ప్రకటించిందని తెలిపారు. సుద్దపల్లి గ్రామానికి చెందిన మేకల హరీష్ కుటుంబానికి త్వరగా 5లక్షల చెక్కును అందించాలని రాష్ట్ర ప్రభుత్వానికి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డిని కోరారు. కార్యక్రమంలో సుద్దపల్లి గ్రామ యువజన సంఘ సభ్యులు వినోద్ రెడ్డి, రాజు, ఆనంద్, అబ్బన్నబుజ్జి ,సృజన్, హరీష్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలి

- తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘాల జేఏసీ మండల అధ్యక్షులు టి.రాజేశ్వర్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి/నిజామాబాద్ సిటీ

గ్రామపంచాయతీ సిబ్బంది బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘాల జేఏసీ మండల అధ్యక్షులు టి.రాజేశ్వర్ డిమాండ్ చేశారు. 17న తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లేందుకు అనుమతి కోరుతూ మండల పంచాయతీ అధికారి సదాశివ్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ సిబ్బందిని రెండవ పిఆర్సి పరిధిలోకి తీసుకొచ్చి జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు కేటగిరీల వారిగా చెల్లించాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 51 నుంచి సవరించి మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేసి పాత కేటగిరిలన్నింటిని కొనసాగించాలన్నారు. కారోబర్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని తెలిపారు. అర్హులైన సిబ్బందికి ప్రమోషన్లు కల్పించాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5లక్షల చెల్లించాలన్నారు. ఇన్సూరెన్స్, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలపై స్పందించి ప్రభుత్వం తక్షణమే చర్చలు జరపాలన్నారు. లేకుంటే ఈనెల 20 తర్వాత నిరాధిక సమ్మెకు సిద్ధమవుతామని వినతి పత్రంలో తెలియజేశారు. కార్యక్రమంలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘాల జేఏసీ మండల సభ్యులు వెంకటరమణ, మనోహర్, భరత్ కుమార్, రవీందర్, సురేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జీపి కార్మికులకు జీ ఓ 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలి - టియుసిఐ

నిజామాబాద్ సిటీ: తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (టియుసిఐ) ఆధ్వర్యంలో నిజామాబాద్ రూరల్ ఎంపీడీవో కార్యాలయం ముందు సోమవారం ధర్నా నిర్వహించి ఎంపీడీవో యిబ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు మామిడాల వెంకటి మాట్లాడుతూ... సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, జీ ఓ 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలని రెండవ పిఆర్సి లో కార్మికులను చేర్చి వేతనాలు ఇవ్వాలని, ప్రతినెల మొదటి తేదీన జీతాలు ఇవ్వడానికి ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించాలని, గ్రీన్ ఛానల్ ద్వారా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన ప్రకారం గ్రామపంచాయతీ వర్కర్ల మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐపికేఎంఎస్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ సాయన్న, జీపీ కార్మికులు అబ్బుల్, నరసయ్య మధు ,లచ్చన్న , ఓడ్డన్నపోసాని, తదితరులు పాల్గొన్నారు.

ఆలూర్‌లో ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-ఆర్మూర్

ఆలూర్ కేంద్రంలో గల జిల్లా పరిషత్ హై స్కూల్ 1997-98 బ్యాచ్ పూర్వ విద్యార్థులు 25 సంవత్సరాల తరువాత సోమవారం ఒక్కచోట కలుసుకున్నారు. వారి పాత జ్ఞాపకాలు, మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. ముందుగా పూర్వ విద్యార్థులందరూ ప్రస్తుత జీవిత స్థితి గతులను ఒకరినొకరు తెలుసుకుంటూ ఆత్మీయంగా ఆనందంతో గడిపారు. ఈ సందర్భంగా ముక్కెర విజయ్ మాట్లాడుతూ ఇలాంటి స్నేహ బంధం కలకాలం కొనసాగాలని కోరుకున్నారు. దాదాపు రెండున్నర దశాబ్దాల క్రితం విద్యావ్యవస్థలో ఉన్న పరిస్థితులు నేటి పరిస్థితులు పోల్చుతూ సందేశం అందించారు. అనంతరం పూర్వ విద్యార్థులు సిల్వర్ జూబ్లీ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో ముక్కెర విజయ్, నాడీశరం మల్లయ్య, పవన్, గంగారెడ్డి, నరేందర్, రామకృష్ణ, రాకేష్, నారాయణ, చిరంజీవి, గోపి, రణధీర్ శర్మ, మమత, శ్రీలత, రేణుక, వనిత తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి వృద్ధురాలి ఆత్మహత్య

నవతెలంగాణ-మోపాల్

ఓ వృద్ధురాలు చెరువులోపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని న్యాల్కల్ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. పోసాని (58), ఆమె భర్త పెద్ద సాయిలు వ్యవసాయ భూమి సాగు చేసేవారు. ఇద్దరి మధ్య డబ్బులు విషయంలో గొడవపడి ఆమె మనస్థాపం చెంది దీంతో నాల్కల్ గ్రామంలోని మాసాని చెరువులో పడి ఆత్మహత్య చేసుకుంది. కూతురు పల్లికొండ స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభిస్తున్నట్లు ఎస్సై యాదగిరి గౌడ్ సోమవారం తెలిపారు

బైక్ అదుపుతప్పి కింద పడి వ్యక్తి మృతి


ప్రమాదస్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని కులాస్పూర్ శివారు ప్రాంతంలో ఆదివారం దుస్గాం గ్రామానికి చెందిన ఇందూరి రాములు (47) వ్యక్తిగత పనుల కోసం నిజామాబాద్ వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో తన స్వగ్రామం వెళ్లే దారిలో కులాస్పూర్ గ్రామ శివారులో బైక్ అదుపు తప్పి కిందపడి తలకి గాయాలయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ యాదగిరి గౌడ్ కేసు నమోదు చేసే దర్యాప్తు ప్రారంభిస్తున్నట్టు తెలిపారు.

ప్రత్యేక అభివృద్ధి నిధులతో పనులు ప్రారంభం

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలకేంద్రంలో రేణుక ఎల్లమ్మ ఆలయం వద్దకు వచ్చే భక్తులకు సౌకర్యవంతంగా ఉండేందుకు బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ రెడ్డి చొరవ తీసుకుని రేకుల షెడ్డు నిర్మాణం కోసం ఎస్డీఎఫ్ నిధుల ద్వారా 2 లక్షల 50 వేల రూపాయలు మంజూరు చేశారు. జక్కని ముదిరాజ్ సంఘం వద్ద సీసీ డ్రైనేజీ కోసం 2 లక్షల 50 వేల రూపాయలు మంజూరు చేశారు. దీంతో సోమవారం కాంగ్రెస్ నాయకులు కొబ్బరి కాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గౌడ సంఘ సభ్యులు, జక్కని ముదిరాజ్ సంఘ సభ్యులు సునీల్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు శివన్నోళ్ళ శివకుమార్, డీసీసీ డెలిగేట్ గడ్డం జీవన్ రెడ్డి, కిసాన్ ఖేత్ మండలాధ్యక్షులు ముస్కు మోహన్ రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షులు రేండ్ల రాజారెడ్డి, పన్నాల నర్సారెడ్డి, బద్దం లింగారెడ్డి, మురళి గౌడ్, తదితరులు పాల్గొన్నారు.


పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బిజ్జు దత్తాద్రి నియామకం

నవతెలంగాణ-ఆర్మూర్



పట్టణానికి చెందిన పద్మశాలి సంఘం సీనియర్ నాయకులు బిజ్జు దత్తాద్రి చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులుగా సోమవారం నియమితులయ్యారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు వీర మోహన్ నియామక పత్రాన్ని అందజేశారు. జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షునిగా పనిచేస్తూ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా నియామకం కావడం పట్ల పట్టణానికి చెందిన పలువురు హర్షం వ్యక్తం చేశారు.

అక్రమ అరెస్టులతో పోరాటాలు ఆపలేరు

- పిడిఎస్‌యు

నవతెలంగాణ-విలేకరుల బృందం

ఆర్మూర్:అక్రమ అరెస్టులతో పోరాటాలను ఆపలేరని పిడిఎస్‌యు ఏరియా ప్రధాన కార్యదర్శి నిఖిల్ అన్నారు. సోమవారం ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వానికి విద్యార్థులపై ఎలాంటి ప్రేమ లేకుండా కక్ష పూరితంగా ఫుడ్ పాయిజన్ ద్వారా వందలాది మంది విద్యార్థులు నేలరాలుతున్న అనేక ఘటనలు జరుగుతున్న పట్టించుకోవడం లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను విడుదల చేయకుండా గత ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందని తెలిపారు. దీనికి నిరసనగా పిడిఎస్‌యు రాష్ట్ర కమిటీ అసెంబ్లీ ముట్టడికి పిలుపునిస్తే ముట్టడిని నిర్వీర్యం చేయాలని ఎక్కడికక్కడ ముందస్తు అరెస్టు చేయడం అప్రజాస్వామ్యమని వారన్నారు. ఈ సందర్భంగా సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజా పంథా సబ్ డివిజన్ కార్యదర్శి కిషన్, పిడిఎస్సి రాష్ట్ర నాయకులు అనిల్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్‌లన అక్రమంగా అరెస్టు చేయడం మేధావులు, విద్యార్థులు, నాయకులు ఖండించాలని అన్నారు. వెంటనే విడుదల చేయాలని విద్యార్థులకు పౌష్టికమైన ఆహారం పెట్టి, స్కాలర్షిప్ విడుదల చేసి మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు. లేనిపక్షంలో పోరాటాలు తప్పవని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సిద్దు వినయ్ నితిన్, నిఖిల్, సింహాద్రి, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ సిటీ :అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బోధన్, వర్ని, తెలంగాణ యూనివర్సిటీ, నిజామాబాద్, ఆర్మూర్, పిడిఎస్‌యూ నాయకులు ఆర్ గౌతమ్ కుమార్, కార్తీక్, రవీందర్, అక్షయ్, రాకేష్, ప్రిన్స్‌లను అరెస్ట్ చేశారని పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ తెలిపారు. అక్రమ అరెస్టులను ఖండిస్తున్నామని అరెస్టు అయిన వారిని వెంటనే విడుదల చేయాలని తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థలలో ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్నాయన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని, ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

డిచ్‌పల్లి :తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ముందస్తుగా తెలంగాణ యూనివర్సిటీ పిడిఎస్‌యూ నాయకులు రవీందర్, అక్షయ్, రాకేష్‌లను అరెస్టు చేసి డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తుందని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించక ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రిని నియమించలేదని, యూనివర్సిటీలకు అందాల్సిన స్పెషల్ గ్రాంట్స్‌ను విడుదల చేయడం లేదన్నారు. నాయకుల అరెస్టులను పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ ఖండించారు. అరెస్టు చేసిన వారినందరిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

జక్రాన్‌పల్లి:పిడిఎస్యు పోరాటాలకు భయపడే నాయకులను అరెస్టు చేశారని, అక్రమ అరెస్టులతో పోరాటాలను ఆపలేరని పిడిఎస్యు రాష్ట్ర నాయకులు అనిల్ కుమార్ అన్నారు. మండలంలోని అర్గుల్ గ్రామంలో అనిల్ కుమార్‌ను అరెస్టు చేసి అదుపులోకి తీసుకున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5
నిజామాబాద్-కామారెడ్డి
మంగళవారం | డిసెంబర్ 17, 2024 | www.navatelangana.com

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని రెడ్డిపేట గ్రామానికి చెందిన మాచర్ల నర్సింలు అనారోగ్యంతో మృతిచెందగా.. అదే గ్రామానికి చెందిన రైజింగ్ స్టార్స్ యూత్ సభ్యులు స్పందించి బాధిత కుటుంబానికి రూ3000, 50 కేజీల బియ్యాన్ని సోమవారం అందజేశారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు లింబాద్రి, భానుచందర్, మహేష్, రమేష్, ప్రశాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం, బియ్యం అందజేస్తున్న యూత్ సభ్యులు

కొత్త పింఛన్లు మంజూరు చేయాలి

నవతెలంగాణ-పొతంగల్

కొత్త పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండల కేంద్రంలో పొతంగల్ గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా, కొత్త పింఛన్లు మంజూరు చేయకపోవడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మహిళలకు రూ.2,500 అందించాలన్నారు. కార్యక్రమంలో బజరంగ్, రమేశ్, శంకర్, పండరి, రాములు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

జొన్న సాగు..
సస్యరక్షణతో మేలు

వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలి



నిజాంసాగర్ మండలంలో సాగవుతున్న జొన్న పంట

నవతెలంగాణ-నిజాంసాగర్

నిజాంసాగర్ మండలంలోని కొన్ని గ్రామాలలో చెరువులలో నీరు తక్కువ ఉండడం వలన వాణిజ్య పంట అయిన జొన్నను వివిధ గ్రామాలలో యాసంగి పంటలో రైతులు అధికంగా సాగు చేస్తున్నారు. ఉమ్మడి నిజాంసాగర్ మండల వ్యాప్తంగా సుమారు 2150 ఎకరాలలో జొన్న సాగు చేస్తున్నట్టు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో జొన్నసాగులో సస్యరక్షణ చర్యలపై నిజాంసాగర్ మండల వ్యవసాయ అధికారి అమర్ ప్రసాద్ రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఆ వివరాలు రైతుల కోసం.

పంటను ఆశించే పురుగులు..

మొవ్వ తొలచే ఈగ

గింజ మొలకెత్తిన మొదటి వారం నుంచి 5 వారాల వయస్సు వరకు ఆశిస్తుంది. పురుగు ఆశించిన మొవ్వ ఎండిపోయి చనిపోతుంది. మొవ్వ లాగినప్పుడు సులువుగా వచ్చి, కుళ్ళిపోయిన వాసన కలిగి ఉంటుంది. పిలకలు అధికంగా వస్తాయి. దీని నివారణకు జొన్న పంటను సకాలంలో విత్తుకోవాలి. థయోమిథక్సామ్ 3 గ్రాములు లేదా ఇమిడా క్లోప్రిడ్ ఐదు మిల్లీలీటర్లు కిలో విత్తనానికి కలిపి విత్తన శుద్ధి చేయాలి. ఆలస్యంగా విత్తనం వేయాల్సి వస్తే విత్తనం మోతాదు పెంచి మొవ్వ ఈగ బారిన పడిన మొక్కలను తీసేయాలి. కార్బోఫ్యూరన్, 3 జి గుళికలు మీటర్ సాలుకు 10 గ్రాముల వంతున విత్తేప్పుడు సాళ్లలో వెయ్యాలి. లేదా థయోడీకర్బ్ 75 డబ్ల్యూ జి పి 1.5 గ్రాములు లేదా ల్యాంబ్డాసైహ లోత్రిన్ 5 సిఎస్ 2మిల్లీలీటర్ల నీటికి కలిపి మొక్క మొలకెత్తిన 7,14,21 రోజుల్లో పిచికారీ చేయాలి.

కాండం తొలిచే పురుగు..

ఈ పురుగు పంటను 30 రోజుల తర్వాత నుంచి పంట కోత వరకు ఆశిస్తుంది. గుండ్రని వరుస రంధ్రాలు ఆకులపై ఏర్పడతాయి. మొవ్వ చనిపోయి తెల్ల కంకులు ఏర్పడతాయి. దీని నివారణకు జొన్న విత్తిన 35 నుంచి 45 రోజులలోపు ఎకరాకు నాలుగు కిలోల కార్బోఫ్యూరాన్ గుళికలను కాండపు సుడుల్లో వెయ్యాలి. పురుగు సోకిన మొదటి దశలో ఎమామెక్టిన్ బెంజోయేట్ ముందు ఎకరానికి 80 గ్రా. లేదా క్లొరంట్రానిలిప్రోల్ ముందు ఎకరానికి 60 మి.లీ. పిచికారీ చేయాలి.

కంకి నల్లి..

పిల్ల, పెద్ద పురుగులు గింజలు పాలు పోసుకునే దశలో రసం పీల్చడం కారణంగా గింజలు నొక్కులుగా మారి కంకిలో కొన్నే గింజలు ఉంటాయి. గింజల మీద ఏరుపు మచ్చలు ఏర్పడి అవి క్రమంగా నల్లగా మారుతాయి. గింజలు గట్టి పడిన తర్వాత ఈ పురుగు ఆశించదు. దీని నివారణకు ఎకరానికి 1లీ. డైకోఫాల్ ముందు లేదా స్పైరోమెసిఫెన్ 100 మి.లీ. పిచికారి చేయాలి.

పేను బంక..

కంకులు విత్తు పోసుకునే దశలో ఎక్కువగా ఆశిస్తుంది. దీని నివారణకు డమటన్ లేదా డైమిథొయెట్ లేదా మలాదియాన్ 5 శాతం మందును ఒక లీటర్ నీటికి రెండు మిల్లీలీటర్ల వంతున కలిపి పిచికారీ చేయాలి.

తెగుళ్లు..

గింజ బూజు..

బూజు తెగుళ్ల గాలిలో ఉన్న అనేక శిలీంద్రాలు సముదాయం కారణంగా ఏర్పడుతుంది. ముఖ్యంగా పూత దశలో మొదలుకుని, పాల దశ నుంచి, గింజ గట్టిపడే దశ వరకు ఆశించవచ్చు. గాలిలో తేమశాతం ఎక్కువైనప్పుడు ఈ తెగుళ్ల సోకుతుంది. గింజ కింది భాగంలో నల్లని చాలా ఏర్పడినప్పుడు కంకులను కోసి ఎండబెట్టడం వలన తెగుళ్ల నివారించవచ్చు. పంట కోత ఆలస్యం చేయొద్దు. ప్రోపికోణాజోల్ 25 శాతం, ఈ సి 0.5 మిల్లీ లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

కాండం కుళ్లు..

లేత మొక్కలలో నెల దగ్గర ఉన్న కాండం రంగు కోల్పోయి కృశించి మొక్కలు వాడి ఎండిపోతాయి. తెగులు ఆశించిన మొక్కల కంకులు త్వరగా పక్వానికి వస్తాయి. కాండం లోపల డొల్లగా మారి మొక్కలు విరిగి పడిపోతాయి. దీని నివారణకు కర్బండిజము లేదా కాప్టన్ 3 గ్రాములు కిలో విత్తనానికి కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలి. పుష్పించే దశ ముందు పంట నీటి ఎద్దడికి గురికాకుండా చూసుకోవాలి. తెగులు తట్టుకునే రకాలను సాగు చేయాలి.

విత్తన శుద్ధి చేసుకోవాలి



రైతులందరూ మొదట పంట వేసే ముందు విత్తన శుద్ధి చేసుకోవాలి. విత్తన శుద్ధి చేసుకోవడం వలన కాండం తొలుచు పురుగులను, ఎండు తెగుళ్ళను నివారించవచ్చు. పంట రెండు మూడు ఆకుల దశలో ఉన్నప్పుడు వేప నూనె పిచికారీ చేసుకుంటే కాండం తొలుచు పురుగు, మొవ్వ తొలుచు ఈగ రెండిటి గుడ్లు చనిపోతాయి. **- మండల వ్యవసాయాధికారి అమర్ ప్రసాద్, నిజాంసాగర్.**

మానవ హక్కుల సహాయ సంస్థ ఏర్పాటు చేస్తాం

- మానవ హక్కుల సంస్థ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ఖలీలుల్లా



సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండలంలో మానవ హక్కుల సహాయ సంస్థ ఏర్పాటు చేస్తామని రాష్ట్ర మానవ హక్కుల సంస్థ వైస్ ప్రెసిడెంట్ ఖలీలుల్లా అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మానవ హక్కుల సంస్థ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాగిరెడ్డిపేట్ మండలంలో మానవ హక్కుల సహాయ సంస్థ ఏర్పాటు చేస్తామని ఆయన అన్నారు. సభ్యులుగా చేరేవారు తమను సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో పోచారం గ్రామం నుంచి జగన్ రెడ్డి, చీనూర్ గంపల వెంకన్న, వదలపర్తి మున్నూరు రాజు, గోపాల్పేట రాములు, నాగిరెడ్డిపేట మంగలి శ్రీనివాస్, బాబురావు పాల్గొన్నారు.

'వెయ్యి గొంతులు.. లక్ష డప్పులు' కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

జనవరి 27న హైదరాబాద్‌లో నిర్వహించే వెయ్యి గొంతులు.. లక్ష డప్పులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జ్ మంతాని సామెల్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగిరెడ్డిపేట్ మండల అధ్యక్షులు తొంట సాయిలు, సీనియర్ నాయకులు కంది పద్మారావు, కుంటోల్ల యాదయ్య, బట్టు వెంకట రాములు, జిల్లా మహిళా అధ్యక్షురాలు సట్టిగారి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు భిక్కనూర్‌లో విద్యుత్ అంతరాయం

విద్యుత్ శాఖ ఏఈ సంకీర్త్

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూరు మండలంలో మంగళవారం విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ సంకీర్త్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భిక్కనూర్ 132 కెవి సబ్ స్టేషన్ నుండి దోమకొండ 132 కెవి సబ్ స్టేషన్‌కు డబల్ సర్క్యూట్ లైన్ వేస్తున్నందున ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉన్న కారణంగా కాచాపూర్, పెద్దమల్లారెడ్డి, అయ్యవారిపల్లి, భిక్కనూర్ ప్రజలు విద్యుత్ అధికారులకు సహకరించాలని తెలిపారు.

ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇవ్వాలి

- కాంగ్రెస్ నాయకుల విన్నపం

నవతెలంగాణ-మద్నూర్



మాట్లాడుతున్న నాయకులు

గడిచిన 50 సంవత్సరాల కాలంగా జుక్కల్ నియోజకవర్గానికి మంత్రి పదవి దక్కలేదని.. ప్రస్తుతం జుక్కల్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్న తోటా లక్ష్మి కాంతారావు ఉన్నత చదువులు చదివిన వ్యక్తి అయినందున వెనుకబడ్డ జుక్కల్ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారని అభివృద్ధి ప్రధాతకు మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు ధరాస్ సాయిలు, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షులు హనుమంతు యాదవ్ రాష్ట్ర ముఖ్యమంత్రికి విన్నవించారు. సోమవారం మద్నూర్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతారావుకు మంత్రి పదవి ఇవ్వాలని కోరారు. సమావేశంలో మాజీ మండలాధ్యక్షులు వట్నాల రమేష్, యువ నాయకులు అమూల్ కర్ల సాయిలు, తూమ్ రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిలకు జైలుశిక్ష విధించిన న్యాయమూర్తి

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ఇద్దరు వ్యక్తులు మద్యం సేవించి ఇతరులకు ఇబ్బందులు పెడుతుండడంతో పోలీసులు వారిని పట్టుకుని న్యాయమూర్తి ఎదుట ప్రవేశపెట్టారు. వారిని విచారించిన ద్వితీయశ్రేణి న్యాయమూర్తి వారికి రెండు రోజులపాటు జైలుశిక్ష విధించారు. అందులో భాగంగా సామాజిక సేవ చేయాలని ఆదేశించారు. ఈవ్ టీజింగ్‌కు పాల్పడే ఆకతాయిలకు, బహిరంగ ప్రదేశాలలో మద్యంతాగే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు.

గోదాం నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-రెంజల్



భూమిపూజ చేస్తున్న పలువురు

మండల కేంద్రంలోని సహకార వ్యవసాయ సంఘం ఆధ్వర్యంలో బోర్గం గ్రామంలో మెట్రిక్ టన్నుల గోదాం నిర్మాణానికి ఉమ్మడి జిల్లాల సహకార సంఘం అధ్యక్షులు కుంట రమేష్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల ఇబ్బందులను తెలుసుకొని వారికి అనుకూలంగా గోదాముల నిర్మాణాలను చేపడుతుందన్నారు. రైతుల సౌకర్యార్థం నాణ్యమైన ఎరువులను సరఫరా చేస్తున్నామని, వాటిని కొనుగోలు చేసుకోవాలన్నారు. ప్రైవేటు వ్యక్తులు నాణ్యతలేని ఎరువులను విక్రయిస్తున్నారని ఆయన అన్నారు. రైతుల సౌకర్యార్థం సొసైటీల ఆధ్వర్యంలో సబ్సిడీపై డోన్స్ కొనుగోలు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎరువుల కొరత లేకుండా మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి ప్రత్యేక దృష్టిని సారించారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, రెంజల్ సింగిల్ విండో చైర్మన్ మొయినోద్దీన్, రెంజల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మొబిన్ ఖాన్, రెంజల్ సింగిల్ విండో డైరెక్టర్లు అగ్గ నారాయణ, ఖదీర్ పాషా, పి.సాయిరెడ్డి, డైరెక్టర్ సాయిలు, చంద్రకళ, కాంగ్రెస్ నాయకులు, ఎంఎల్.రాజు, ధనుంజయ్, ఇందిరా దేవి, కార్తీక్ యాదవ్, భూమారెడ్డి, బి.రవి, నిస్సార్ బిగ్, సిద్ధ సాయిలు, నిజాం, సహకార సంఘం బ్యాంకు మేనేజర్ గౌస్‌ఉద్దీన్, ఫీల్డ్ ఆఫీసర్ రోహిత్, సీఈవో ఇంద్రసేన్, సిబ్బంది కిషోర్, ఎల్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వరినాటు కాలి బాటలు ఉత్తర దక్షిణం వైపు ఉండే విధంగా వేయాలి

- ఏఈఓ ప్రశాంత్ కుమాం

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

వరి నాటు కాలిబాటలు ఉత్తర దక్షిణ వైపు ఉండే విధంగా నాటువేయాలని ఏఈఓ ప్రశాంత్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని రాఘవపల్లి గ్రామంలో వరి నాటును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటు కాలిబాటలు ఉత్తర దక్షిణం వైపు ఉండే విధంగా వేసుకుంటే రైతులకు అన్ని రకాలుగా లాభం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈశాన్య రుతుపవనాల వల్ల వీచే గాలులు వానాల నుంచి పంటకు కలిగించే నష్టాన్ని నివారించవచ్చునని ఆయన పేర్కొన్నారు. గంగకు కాలిబాటలు కొట్టడం వలన గాలి వెళ్తురు పంటకు బాగా తగిలి చీడపీడలను నివారించవచ్చని ఆయన అన్నారు. ఒక చదరపు మీటర్లు 44 మొక్కలు ఉండే విధంగా నాటు వేసుకోవాలని ఆయన సూచించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ వెంకటరామిరెడ్డి ఉన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈవో

ముందస్తు అరెస్టులకు అదరం.. బెదరం

- మాజీ సర్పంచ్‌ల స్పష్టీకరణ
- అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా అడ్డగింత

నవతెలంగాణ-విలేకరుల బృందం

ముందస్తు అరెస్టులకు తాము భయపడబోమని మాజీ సర్పంచ్‌ల స్పష్టంచేశారు. తమ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ.. అసెంబ్లీ ముట్టడికి వెళ్లేందుకు సిద్ధమైన మాజీ సర్పంచ్‌లను పోలీసులను అడ్డుకున్నారు. పలుచోట్ల ఎక్కడికక్కడ అరెస్టులు చేశారు.

జుక్కల్ : మండలంలోని 30 గ్రామ పంచాయతీల మాజీ సర్పంచులు సోమవారం హైదరాబాద్ అసెంబ్లీ ముట్టడికి వెళ్లే క్రమంలో ముందస్తుగా కొంతమంది ముఖ్య మాజీ సర్పంచులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మండలంలోని బస్వాపూర్ మాజీ సర్పంచ్‌ను అరెస్టు చేసి జుక్కల్ పీఎస్‌కు తరలించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ రవి పటేల్ మాట్లాడుతూ.. ఇటువంటి అరెస్టులు తమకు కొత్త కాదని అన్నారు. అరెస్టులకు అదిరేది, బెదిరేది లేదని, ముందుగా గతంలో మేము సర్పంచులుగా పని చేసినప్పుడు పాత బిల్లులు వచ్చే వాటిని ముందుగా విడుదల చేయాలని, లేకుంటే కచ్చితంగా అసెంబ్లీ ముట్టడి కొనసాగుతూనే ఉంటుందని హెచ్చరించారు. తమ బిల్లులు తమకు చెల్లిస్తే తామెందుకు రోడ్లమీదకు వస్తామని ప్రశ్నించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కండ్లు తెరిచి మాజీ సర్పంచ్‌ల బాధలను అర్థం చేసుకొని పాత బిల్లులను విడుదల చేయాలని కోరారు



బోధన్ : రూరల్ ఠాణాలో చలి నుంచి వెచ్చదనం పొందుతున్న మాజీ సర్పంచులు



జుక్కల్ : మాజీ సర్పంచ్‌ను ముందస్తుగా అరెస్టు చేసిన పోలీసులు..

అర్ధరాత్రి మాజీ సర్పంచుల అరెస్టు..

రైటప్ : బోధన్ రూరల్ ఠాణాలో చలి నుంచి వెచ్చదనం పొందుతున్న మాజీ సర్పంచులు

బోధన్ : బోధన్, సాలూర మండలాలకు చెందిన మాజీ సర్పంచులను ఆదివారం బోధన్ రూరల్ పోలీసులు అర్ధరాత్రి అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సోమవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైనందున మాజీ సర్పంచులు నిరసన కార్యక్రమాలు చేపట్టకుండా ముందస్తు జాగ్రత్తలో భాగంగా పోలీసులు మాజీ సర్పంచుల ఇంటికి వెళ్లి అర్ధరాత్రి అక్రమంగా అరెస్టు చేశారని మాజీ సర్పంచులు ఆరోపించారు. గజగజ వణికే చలిలో ఇలా అక్రమంగా అరెస్టు చేయడం సిగ్గుచేటని వారు ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారితో పాటు వామపక్ష పార్టీల నాయకులను సైతం అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో మాజీ సర్పంచులు గంగాధర్, సుదర్శన్, నాగయ్య, వామపక్ష పార్టీల నాయకులు మల్లేష్ ఉన్నారు.

మాజీ సర్పంచ్ ఫోరం అధ్యక్షుడి ముందస్తు అరెస్ట్..

నిజాంసాగర్ : మండలంలోని వెల్గనూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రమేష్ గౌడ్‌ను నిజాంసాగర్ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. సర్పంచులకు చెల్లించవలసిన బిల్లులను ప్రభుత్వం చెల్లించకుండా జాప్యం చేస్తుండడంతో రాష్ట్రస్థాయి సర్పంచ్‌ల ఫోరం సంఘం పిలుపు మేరకు సోమవారం అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చారు. మాజీ సర్పంచులు అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షున్ని పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ముట్టడికి మాజీ సర్పంచ్‌లు అందరూ తరలి వెళతారనే ఉద్దేశంతోనే పోలీసులు ముందస్తు అరెస్టు చేయడం సరికాదని ఆయన అన్నారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో మండలంలోని సర్పంచ్‌లకు రావాల్సిన బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

మున్నూరు కాపుల మహాసభ విజయవంతం

నవతెలంగాణ-మద్నూర్

మున్నూరు కాపుల ఐక్యత కోసం బిచ్కుంద మండల కేంద్రంలోని బండయప్ప ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మున్నూరు కాపుల మహాసభ విజయవంతమైనట్లు మద్నూర్ మండల కేంద్ర మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు, జిల్లా మున్నూరు కాపుల ఉద్యోగుల సంఘం నాయకులు డాక్టర్ బండివార్ విజయ్ తెలిపారు. నియోజకవర్గ స్థాయి మున్నూరు కాపుల మహాసభకు మున్నూరు కాపులు పెద్దఎత్తున హాజరైనట్లు తెలిపారు.

బోరు వేయించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని అంతాపూర్ గ్రామ ప్రజల కోసం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు ప్రత్యేక చొరవ చూపుతూ నీటి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. బోరు మోటర్‌ను వేయించారు.